Follow: @ANNTELUGU
02-05-2026
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 125 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ముఖ్యమంత్రితో వీహెచ్ భేటీ!

### వెనుకబడిన తరగతుల సంక్షేమమే లక్ష్యం

అనుభవం, అంకితభావం తోడైతేనే ప్రగతి సాధ్యం

సీనియర్ నేత నియామకంపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం మరియు అభివృద్ధి వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ (మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ) వేదికగా జరిగిన ఈ భేటీలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు మరియు బీసీ వర్గాల అభ్యున్నతికి చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ముఖ్యమంత్రి ఆయనతో చర్చించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



**నేనే సీఎం**
- మీరే మంత్రులు
- అభ్యర్థులతో టీవీకే విజయ్

02

**నేడు కవిత మీట్ ది ప్రెస్**
- కొత్త పార్టీ ఏర్పాటు తర్వాత
- తొలిసారి మీడియా ముందుకు



02

**మద్యం తాగి అసెంబ్లీకి సీఎం**
- ప్రతిపక్షాల ఆందోళన
- లైవ్‌లో ఆల్కహాల్ టెస్టుకు విపక్షాల డిమాండ్
- తిరస్కరించిన స్పీకర్



02

# ఆర్టీసీకి 'రేవంత్' భరోసా

## ₹1000 కోట్ల బకాయిల విడుదల..

సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళిక!.. అందరం కలిస్తేనే ప్రభుత్వం..

కార్మికులకు, నాకు మధ్య దూరం లేదు.. జూబ్లీహిల్స్ భేటీలో సీఎం స్పష్టీకరణ

అంతర్జాతీయ స్థాయిలో బస్ టెర్మినల్స్.. మెట్రోతో ఈవీ బస్సుల అనుసంధానం

ఆర్టీసీని 'నెంబర్ 1'గా నిలుపుదామన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముక వంటి ఆర్టీసీని అన్ని విధాలా బలోపేతం చేస్తామని, సంస్థ మనుగడకు, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సుమారు 14 కార్మిక సంఘాల నాయకులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమావేశమయ్యారు. సంస్థ అభివృద్ధికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న చొరవపై సంఘాల నేతలు ఈ సందర్భంగా సీఎంతో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "నేను వేరు, మీరు వేరు అన్న భావన నాకు ఎప్పుడూ లేదు.. అందరం కలిస్తేనే ప్రభుత్వం" అంటూ కార్మికులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆర్టీసీ కార్మికులు బలంగా ఆకాంక్షించారని, వారి పోరాటాల్లో తాము ఎప్పుడూ భాగస్వామ్యం వహించామని పేర్కొన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ఇప్పటికే బస్సుల సంఖ్యను, నియామకాలను పెంచామని, ఆదాయ వనరులను మెరుగుపరిచామని వివరించారు. కార్మికులు పట్టుదలతో పనిచేయడం వల్లే తెలంగాణ ఆర్టీసీ నేడు దేశంలోనే గొప్ప సంస్థగా నిలిచిందని ఆయన ప్రశంసించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటికే ప్రభుత్వం రూ. 8 వేల కోట్లను సంస్థకు అందించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల పాత బకాయిల కోసం తాజాగా మరో రూ. 1000 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు.

మిగతా 2లో




# ఒకేసారి వీర బాదుడు

### వాణిజ్య సిలిండర్ ధర రూ.993 పెంపు.. రూ.3వేలు దాటిన సిలిండర్ రేట్

నేను ముందే చెప్పా రాహుల్ గాంధీ.. మోదీ మోడే కానుక కేటీఆర్ ఫైర్

**ఢిల్లీ, మహా :** వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.

**గృహ వినియోగదారులకు ఊరట..**

వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది.

**మేడే నాడు మోదీ బాదుడు**

గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై కేటీఆర్ ఫైర్

02

**నేను ముందే చెప్పా...**

ధర పెంపుపై రాహుల్ గాంధీ

02

## తెలంగాణ పోలీసు సారథిగా సీవీ ఆనంద్

అట్టహాసంగా 'గార్డ్ ఆఫ్ ఆనర్' స్వీకరణ!..శాంతిభద్రతల పరిరక్షణే పరమావధి

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం.. పోలీసు వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు కఠిన శిక్షలు తప్పవన్న సీవీ ఆనంద్



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర పోలీసు యంత్రాంగం అత్యున్నత పదవిలో భారీ మార్పు చోటుచేసుకుంది. తెలంగాణ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా 1991 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ శుక్రవారం అట్టహాసంగా బాధ్యతలు స్వీకరించారు. లక్డీకాపూల్‌లోని డీజీపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు బలగాలు గౌరవ సూచకంగా 'గార్డ్ ఆఫ్ ఆనర్' సమర్పించాయి. వేద పండితుల ఆశీర్వచనాలు, సహచర ఉన్నతాధికారుల శుభాకాంక్షల మధ్య ఆయన అధికారికంగా బాధ్యతలను చేపట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారిన తరుణంలో, క్షేత్రస్థాయిలో అపారమైన అనుభవం ఉన్న ఆనంద్‌ను ప్రభుత్వం ఈ కీలక పోస్టులో నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.బాధ్యతలు స్వీకరించిన వెంటనే సీవీ ఆనంద్ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారిని పూర్తిగా రూపుమాపడమే తమ ప్రథమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు.

మిగతా 2లో

## రికార్డు స్థాయికి తెలంగాణ ఆదాయం

### దూసుకుపోయిన జీఎస్టీ వసూళ్లు..

### ఏప్రిల్ లో 35% వృద్ధి



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అత్యధిక వసూళ్లను నమోదు చేస్తూ చరిత్ర సృష్టించింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 35 శాతం భారీ వృద్ధి నమోదైనట్లు వాణిజ్య పన్నుల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2026లో ఏకంగా రూ. 4,621 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ. 3,433 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అదనంగా రూ. 1,188 కోట్లు వసూలైంది. జీఎస్టీ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుండి ఒక నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటిసారి. గత నాలుగు నెలలుగా తెలంగాణ జీఎస్టీ ఆదాయం స్థిరంగా రూ. 4,000 కోట్లకు పైగానే నమోదవుతోంది. జీఎస్టీతో పాటు పెట్రోల్, మద్యంపై వ్యాట్, వృత్తి పన్నులను కలుపుకుని మొత్తం రూ. 7,570 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేరింది.

**దేశంలోనే రెండో స్థానం**

పన్ను వసూళ్ల వృద్ధి రేటులో కర్ణాటక తర్వాత తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి తన ఆర్థిక సత్తాను చాటింది. ఆదాయం పెరగడానికి కారణాలను పరిశీలిస్తే రాష్ట్రంలో కీలక రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, వ్యాపార అనుకూల వాతావరణం వల్ల కొత్త పెట్టుబడులు రావడం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. అలాగే, పన్ను చెల్లింపుదారులు స్వచ్ఛందంగా, పారదర్శకమైన విధానాలతో పన్నులు చెల్లించడం వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది.పన్ను చెల్లింపుదారులకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు, మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని వాణిజ్య పన్నుల కమిషనర్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## శ్రామికుడే రాష్ట్ర ప్రగతి చక్రం

### 15 నగరాల్లో అత్యాధునిక 'లేబర్ అడ్డా'లు

ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్.. తలసేమియా బాధితుడికి అండగా నిలిచిన ప్రభుత్వం

పేదవాడి కళ్లలో వెలుగులు.. గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ప్రారంభం



**మచిలీపట్నం,మహా:** కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మేడే వేడుకలు జరుపుకుంటున్న శ్రామికులకు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తీపి కబురు అందించారు. పమిడిముక్కల మండలం వీరంకి లాకు గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో నేరుగా ముఖాముఖి నిర్వహించిన సందర్భంగా, వారి కష్టాలను గుర్తించి పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించింది. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములేనని, వారి సంక్షేమం కోసమే ప్రభుత్వం 'అన్న క్యాంటీన్లు', 'ఆటో డ్రైవర్ సేవలో', 'మత్స్యకారుల సేవలో' వంటి బృహత్తర పథకాలను అమలు చేస్తోందని వెల్లడించింది. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికులకు నైపుణ్య శిక్షణ కల్పించడమే కాకుండా, వారి ఆరోగ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆరు చోట్ల కొత్తగా ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కార్మికుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా రాష్ట్రంలోని 15 ప్రధాన నగరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో 'లేబర్ అడ్డా'ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఒక చారిత్రాత్మక నిర్ణయంగా చెప్పవచ్చు. వేచి ఉండే సమయంలో కార్మికులకు కనీస వసతులు కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశం. అదేవిధంగా, గత ఏడాది ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 'పేదల సేవలో' కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్లను అందజేస్తోంది.

మిగతా 2లో

# నేనే సీఎం మీరే మంత్రులు

### అభ్యర్థులతో టీవీకె విజయ్

**మహా:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మే 4న వెల్లడి కానున్నాయి. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నా డీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలిచే అవకాశం ఉంది. మెజారిటీసర్వేలు నటుడు విజయ్ టీవీకే పార్టీకి 20 నుంచి 25 మధ్య స్థానాలు రావచ్చునని తేల్చాయి. అయినా విజయ్ పవర్ పై ఫుల్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. నేనే సీఎం.. మీరే మంత్రులు అంటూ ఎమ్మెల్యే అభ్యర్థులకు షాకింగ్ వైబ్ ఇచ్చారు. విజయ్ కింగ్ కాకున్నా కింగ్ మేకర్ అవుతారని, ఊహించిన దానికంటే ఎక్కువ ప్రభావం చూపారని రాజకీయవర్గాలు అంటున్నాయి.

# నేను ముందే చెప్పా...

### ధర పెంపుపై రాహుల్ గాంధీ

**ఢిల్లీ, మహా :** దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర శుక్రవారం భారీగా పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ .1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు.

### నేడు కవిత

# మీట్ ది ప్రెస్

### కొత్త పార్టీ ఏర్పాటు తర్వాత తొలిసారి మీడియా ముందుకు

**హైదరాబాద్, మహా :** కొత్తగా ఏర్పాటైన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియా ముందుకు రానున్నారు. మే 2వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగే 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఈ కార్యక్రమాన్ని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంపై కవిత స్పందిస్తూ, తన కొత్త పార్టీని విజయవంతంగా ప్రారంభించిన అనంతరం జర్నలిస్టులతో సమావేశమవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన తమ పార్టీ సమగ్ర దార్శనికతను, రాష్ట్ర ప్రగతి కోసం రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా పంచుకుంటానని ఆమె పేర్కొన్నారు. కొత్త పార్టీని స్థాపించిన తర్వాత కవిత తొలిసారిగా అధికారికంగా మీడియా సమావేశంలో పాల్గొంటుండటంతో ఈ కార్యక్రమానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. తెలంగాణ అభివృద్ధిపై ఆమె ప్రకటించబోయే ప్రణాళికలు, పార్టీ విధానాలు ఎలా ఉండబోతున్నాయనే విషయంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# మద్యం తాగి అసెంబ్లీకి సీఎం

### ప్రతిపక్షాల ఆందోళన.. లైవ్‌లో ఆల్కహాల్ టెస్టుకు విపక్షాల డిమాండ్.. తిరస్కరించిన స్పీకర్



**ఛండీఘడ్. మహా :** పంజాబ్ అసెంబ్లీలో శుక్రవారం ఊహించని హైడ్రామా చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం మత్తులో సభకు వచ్చారంటూ విపక్ష కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఆరోపించడమే కాకుండా, ఆయనకు తక్షణమే బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేయడంతో సభ అట్టుడికిపోయింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రవర్తనపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. సీఎం మద్యం సేవించి సభకు వచ్చారని, ఆయనకు తక్షణమే ఆల్కహాల్ టెస్ట్ చేయాలని ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బాజ్వా డిమాండ్ చేయడంతో సభలో గందరగోళం మొదలైంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, ఆప్ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకువెళ్లి పరస్పర నినాదాలతో హోరెత్తించడంతో స్పీకర్ సభను వాయిదా వేయాల్సి వచ్చింది.

**అది ప్రజాస్వామ్య దేవాలయానికి అవమానం**

ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బాజ్వా స్పీకర్‌కు రాసిన లేఖలో ముఖ్యమంత్రి ప్రవర్తన తీవ్ర అభ్యంతరకరంగా ఉందని పేర్కొన్నారు. సభలో ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా లేవనెత్తిన ఆరోపణలకు సమాధానం చెప్పకుండానే ముఖ్యమంత్రి బయటకు వెళ్లిపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. ముఖ్యమంత్రితో సహా సభలో ఉన్న ఎమ్మెల్యేలందరికీ డోప్ టెస్ట్, బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించాలి. ప్రజాస్వామ్య దేవాలయంలో ఇలాంటి ప్రవర్తనను అనుమతిస్తే ప్రజల్లో సభపై ఉన్న గౌరవం పోతుంది అని బాజ్వా హెచ్చరించారు.

**ఫ్లోర్ టెస్ట్ కంటే బ్రీత్ అనలైజర్ టెస్ట్ ముఖ్యం**

పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖర్ కూడా విపక్షాల డిమాండ్‌కు మద్దతు పలికారు. గురుద్వారాలు లేదా దేవాలయాల్లోకి ఎవరైనా మద్యం సేవించి వెళ్తే అది ఎంత పెద్ద అపరాధమో, అసెంబ్లీలోకి మద్యం మత్తులో రావడం కూడా అంతే పెద్ద నేరం. ఈరోజు ప్రభుత్వం ఫ్లోర్ టెస్ట్ చేయడం కంటే, సభ్యులందరికీ బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయడం ముఖ్యం. అది చేస్తే అసలు ఫ్లోర్ టెస్ట్ అవసరమే ఉండదు అని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ నేతలు ఆరోపించారు.

**ఆరోపణలను కొట్టిపారేసిన ఆప్**

విపక్షాల ఆరోపణలపై అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఇవన్నీ నిరాధారమైన, హాస్యాస్పదమైన ఆరోపణలని పంజాబ్ ఆప్ అధ్యక్షుడు, మంత్రి అమన్ అరోరా మండిపడ్డారు. సభలో చర్చను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఒక సున్నితమైన సరిహద్దు రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇలాంటి వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని ఆప్ నేతలు పేర్కొన్నారు. విపక్షాల ఆందోళనల మధ్యే మాన్ ప్రభుత్వం సభలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. కాగా, డోప్, బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయాలన్న విపక్షాల విజ్ఞప్తిని స్పీకర్ తోసిపుచ్చారు.

# ముఖ్యమంత్రితో వీహెచ్ భేటీ!

(మొదటిపేజీ తరువాయి)



దశాబ్దాలుగా బీసీల గొంతుకగా, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న హనుమంతరావు అనుభవం ప్రభుత్వానికి ఎంతో అవసరమని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. ఈ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ , పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఉన్న బీసీ వర్గాలకు ఏ విధంగా చేరవేయాలనే అంశంపై హనుమంతరావు తనకున్న సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో , ప్రభుత్వంలో సీనియర్లు, జూనియర్ల సమన్వయంతోనే సమర్థవంతమైన పాలన సాధ్యమని భావిస్తున్న రేవంత్ రెడ్డి, హనుమంతరావు వంటి అనుభవజ్ఞులను కీలక పోస్టుల్లో నియమించడం ద్వారా సామాజిక సమతుల్యతను పాటించారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న సామాజిక, ఆర్థిక సర్వే (కులగణన) వంటి అంశాల్లో వీహెచ్ పాత్ర కీలకమని భావిస్తున్నారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రికి హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంతో పాటు, విద్య, ఉపాధి రంగాల్లో వారికి దక్కాల్సిన వాటాను సక్రమంగా అందించేలా ప్రభుత్వం తరపున తాము గట్టి కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన ఇతర నేతలు కూడా హనుమంతరావు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఇది వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ఇస్తున్న భరోసా అని కొనియాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన ఈ భేటీ, రాబోయే రోజుల్లో బీసీ సంక్షేమ శాఖ తీసుకోబోయే కీలక నిర్ణయాలకు పునాదిగా నిలవనుంది. ముఖ్యంగా వెనుకబడిన కులాల వృత్తిదారులకు చేయూతనిచ్చే పథకాలు, గృహలక్ష్మి వంటి పథకాల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై సలహాదారుగా హనుమంతరావు ఇచ్చే నివేదికలు అత్యంత కీలకం కానున్నాయి. పాలనలో అనుభవాన్ని, యువ ఉత్సాహాన్ని మేళవించి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి ఈ నియామకం ఒక నిదర్శనంగా నిలుస్తోంది.

### తెలంగాణ పోలీసు

# సారథిగా సీవీ ఆనంద్



(మొదటిపేజీ తరువాయి)

యువత భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. అలాగే రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను అదుపు చేయడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటామని, ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు నేరగాళ్లను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా 'ఫ్రెండ్లీ పోలీసింగ్'ను కొనసాగిస్తూనే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో సీవీ ఆనంద్ చేపట్టిన సంస్కరణలు, ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ మరియు పండుగల సమయంలో శాంతిభద్రతల నిర్వహణలో ఆయన చూపిన చొరవను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్ల పనితీరును మెరుగుపరచడం, సిబ్బందిలో జవాబుదారీతనం పెంచడం మరియు మహిళా భద్రతకు పెద్దపీట వేయడం వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా రాజధాని నగరం హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కూడా పోలీసు నిఘాను పటిష్టం చేసేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో వినూత్న పాలన అందిస్తున్న తరుణంలో, దానికి అనుగుణంగా పోలీసు యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం సీవీ ఆనంద్ ముందున్న ప్రధాన సవాలు. అక్రమ రవాణా, గూండాగిరీ వంటి సామాజిక రుగ్మతలను అణిచివేయడంలో ఆయనకున్న ట్రాక్ రికార్డు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు కొత్త జవజీవాలు ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, ప్రభుత్వం ఆశించిన విధంగా రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# 73 సార్లు తప్పించుకున్న దొంగ

### చివరికి ఇలా చిక్కాడు.. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ హైటెక్ దోపిడీ.. కోనసీమ రామారావు ఆట కట్టు

**హైదరాబాద్, మహా:** చదువుకున్న చదువుకు, చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి గౌరవం ఇవ్వాల్సింది పోయి.. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఒక ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ పరమ కిరాతకమైన హైటెక్ మోసాలకు తెరలేపాడు. ఏటీఎంల వద్ద అమాయక ప్రజలనే లక్ష్యంగా చేసుకుని, సాయం చేస్తామంటూ నమ్మించి గత ఏడేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడు రామారావు అలియాస్ శ్రీరామ్ ఉదంతం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఏపీలోని కోనసీమ జిల్లాకు చెందిన ఈ నిందితుడిని హైదరాబాద్ పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుకుని, అతను చేస్తున్న మాయాజాలానికి ముగింపు పలికారు. బెట్టింగ్ వ్యసనానికి బానిసై, సాఫ్ట్‌వేర్ కొలువు వదిలేసి మరీ సాగించిన ఈ నేరాల పరంపరలో ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల సికింద్రాబాద్‌కు చెందిన ఓ మహిళ కోఠిలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు లక్ష రూపాయల నగదు డిపాజిట్ చేసేందుకు రాగా, నిందితుడు రామారావు తన కపట బుద్ధితో ఆమెను బురిడీ కొట్టించాడు. తాను సాయం చేస్తానని, నిఫ్టీ ద్వారా డబ్బులు పంపిస్తానని నమ్మించి ఆమె వద్ద నుంచి లక్ష రూపాయలు తీసుకున్నాడు. టెక్నాలజీలో ఆరితేరిన నిందితుడు, ఆమెకు మొబైల్‌లో ఒక ఫేక్ మెసేజ్ చూపించి నగదు బదిలీ అయినట్లు నమ్మబలికి అక్కడి నుంచి పరారయ్యాడు. సాయంత్రం వరకు తన ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సుల్తాన్ బజార్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ హైటెక్ దొంగ గుట్టు రట్టయింది. సీసీటీవీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు జేబీఎస్ డార్మిటరీలో ఉన్నట్లు గుర్తించి, మరొకరిని ముంచేందుకు సిద్ధమవుతుండగా నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. నిందితుడు ఒకప్పుడు హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేసేవాడు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి క్రెడిట్ కార్డుల ద్వారా భారీగా అప్పులు చేశాడు. వాటిని తీర్చడానికి అడ్డదారులు వెతుకుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. 2018 నుంచి 2025 మధ్య కాలంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో సుమారు 73 సార్లు ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడు. కేవలం తెలంగాణలోనే ఈ ఏడాదిలో అతనిపై 8 కేసులు నమోదయ్యాయి. ఏటీఎం డిపాజిట్ సెంటర్లను టార్గెట్ చేసుకుని, అక్కడ ఇబ్బంది పడే వృద్ధులను లేదా మహిళలను ఎంచుకుని వారిని మాయమాటలతో నమ్మించి నగదు కాజేయడం ఇతని పద్ధతి. నిందితుడి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, అతని బ్యాంక్ ఖాతాలోని రూ. 2.40 లక్షల నగదును వెంటనే ఫ్రీజ్ చేయించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఏటీఎం కేంద్రాల వద్ద గుర్తు తెలియని వ్యక్తులకు నగదు కానీ, కార్డులు కానీ ఇవ్వవద్దని కోరారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత అధికారిక బ్యాంక్ యాప్ ద్వారా బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలని, అపరిచితులకు పిన్ నంబర్లు లేదా ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. ఎవరైనా సాయం చేస్తామంటూ దగ్గరకు వస్తే అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# అమరావతిలో బసవతారకం నిర్మాణ పనులకు బాలయ్య శ్రీకారం

### రూ.750 కోట్ల వ్యయంతో అంతర్జాతీయస్థాయిలో...

**అమరావతి, మహా:** రాజధాని అమరావతి ప్రాంతంలో మరో అంతర్జాతీయ స్థాయి వైద్య మణిహారం చేరుతోంది. పేదలకు మెరుగైన క్యాన్సర్ వైద్యం అందించాలనే గొప్ప సంకల్పంతో తుళ్లూరు పరిధిలోని ఐనవోలు సమీపంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణ పనులు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి చైర్మన్, ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ బృహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. సుమారు 21 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ వైద్యాలయం భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కాకుండా పొరుగు రాష్ట్రాలకు కూడా పెద్ద దిక్కుగా మారనుంది. భూమిపూజ అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలకృష్ణ అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పనులు ప్రారంభించే సరిగ్గా అదే సమయంలో వర్షం కురవడాన్ని ఆయన ఒక శుభ సూచకంగా అభివర్ణించారు. సంకల్పం గట్టిదైతే ప్రకృతి కూడా సహకరిస్తుందని, ఈ వరుణ దేవుడి ఆశీస్సులతో పనులు నిర్విఘ్నంగా సాగుతాయన్న నమ్మకం తనకు ఉందని ఆయన ఉద్వేగంగా పేర్కొన్నారు. ముఖ్యంగా తన తల్లి బసవతారకం గారు క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసిన క్షణం నుంచే, పేదలకు ఇటువంటి కష్టం రాకూడదని తన తండ్రి ఎన్టీఆర్ ఈ ఆశయానికి పునాది వేశారని, దానిని అమరావతి గడ్డపై కొనసాగించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు బాలయ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు జాప్యంపై బాలకృష్ణ స్పందిస్తూ కొన్ని కీలక వాస్తవాలను వెల్లడించారు. వాస్తవానికి 2019లోనే ఈ ఆస్పత్రికి అంకురార్పణ జరగాల్సి ఉన్నప్పటికీ, గత ఐదేళ్ల కాలంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ముందుకు కదల్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఆగస్టులో శంకుస్థాపన చేసినా, భూమి గుండా వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ల తొలగింపు వంటి సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయని, వాటిని అధిగమించడానికి ఎనిమిది నెలల సమయం పట్టిందని వివరించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా, అత్యున్నత ప్రమాణాలతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సుమారు రూ.750 కోట్ల భారీ వ్యయంతో మొదటి దశ పనులను ప్రారంభించారు. తొమ్మిది అంతస్తుల (జి+9) భారీ భవన సముదాయంలో ప్రాథమికంగా 500 పడకలతో ఈ ఆస్పత్రి సేవలు అందించనుంది. భవిష్యత్తులో దీనిని 1000 పడకల సామర్థ్యం వరకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2028 నాటికి పనులన్నీ పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అమరావతి కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, మెడికల్ హబ్‌గా ఎదగాలన్న విజన్‌తో ఇక్కడ అత్యాధునిక రేడియేషన్ థెరపీ, సర్జికల్ ఆంకాలజీ వంటి విభాగాలు ఏర్పాటు చేస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. దీనివల్ల కోస్తాంధ్ర రాయలసీమ ప్రాంత ప్రజలు క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్ లేదా బెంగళూరు వంటి సుదూర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మేడే నాడు మోదీ బాదుడు

### గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, మహా:** కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ సిలిండర్ ధరను భారీగా పెంచిందని కేటీఆర్ విమర్శించారు. ఈ రకమైన నిర్ణయాలతో సామాన్యుడు జీవించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్ కార్మికుల నడ్డి విరిచేలా కేంద్ర నిర్ణయం ఉందని ధ్వజమెత్తారు. గతంలో ఎవరూ ఇంత పెద్ద ఎత్తున గ్యాస్ ధరలను పెంచలేదని అన్నారు. ఒకేసారి 993రూ.లు పెంచడం మోదీ ప్రజలకు ఇచ్చిన మేడే బాదుడు కానుక అని విమర్శించారు. ఈ ప్రభావం కార్మికులు, సామాన్యులపై ప్రతికూలంగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు.

# ఆర్టీసీకి 'రేవంత్' భరోసా

(మొదటిపేజీ తరువాయి)

సంస్థను ఆధునీకరించే దిశగా కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. గజULARమారంలో బస్ టెర్మినల్ కోసం 100 ఎకరాలు కేటాయించామని, శంషాబాద్ వద్ద 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి టెర్మినల్ నిర్మిస్తామని తెలిపారు. డీజిల్ ఖర్చును తగ్గించుకోవడమే లక్ష్యంగా 1000 ఈవీ బస్సులను కొనుగోలు చేసి వాటిని మెట్రో రైలుతో అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ ఏటా డీజిల్ కోసం సుమారు రూ. 2000 కోట్లు ఖర్చు చేస్తోందని, ఈ వ్యయాన్ని తగ్గించుకోవడానికి ఈవీ బస్సులను ప్రోత్సహించడం ఒక్కటే మార్గమని ఆయన విశ్లేషించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల కోసం మినీ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోందని, తద్వారా సంస్థ ఆదాయం పెరిగి ఖర్చులు తగ్గేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను తమ ప్రభుత్వం చేపట్టిందని, ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను కూడా తగ్గించే ప్రసక్తి లేదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. యూనియన్ల ఏర్పాటు, విలీనం వంటి కీలక అంశాలపై కార్మిక సంఘాలే పరస్పరం చర్చించుకుని ఒక ప్రణాళికతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. పీఆర్సీ వంటి ఆర్థిక పరమైన అంశాలపై త్వరలోనే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని, శాశ్వత పరిష్కారం కోసం ఆప్షన్లను తమ ముందు పెట్టాలని కోరారు. కార్మికులు రాజకీయ ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం జరుగుతుందని, యాజమాన్యం కార్మికుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని హితవు పలికారు. కార్మికులు, డిపో మేనేజర్ల మధ్య గ్యాప్ రాకుండా అధికారులు జాగ్రత్త వహించాలని, కార్మికుల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# శ్రామికుడే రాష్ట్ర ప్రగతి చక్రం



(మొదటిపేజీ తరువాయి)

పమిడిముక్కల గ్రామంలో ఒక తలసేమియా బాధితుడికి పింఛన్ అందించి, ఆ కుటుంబానికి భరోసా కల్పించిన తీరు సభికులను ఆకట్టుకుంది. అర్హులైన ప్రతి పేదవాడి కళ్లలో సంతోషం చూడటమే తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఈ సందర్భంగా పాలకుల సంకల్పాన్ని చాటిచెప్పారు. మరోవైపు, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఆరోగ్య రంగంలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి నేత్ర వైద్యాన్ని ఉచితంగా లేదా రాయితీపై అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఐ కేర్ సెంటర్'ను ఘనంగా ప్రారంభించారు. సువెన్ లైఫ్ సైన్సెస్ చైర్మన్ శ్రీ జాస్తి వెంకట్ అందించిన ఉదారమైన సహకారంతో ఈ సెంటర్ రూపుదిద్దుకుంది. ఏడాదికి సుమారు 50 వేల మందికి ఓపీ సేవలు, 5 వేల మందికి శస్త్రచికిత్సలు చేసే సామర్థ్యం ఉన్న ఈ ఆస్పత్రి, కేవలం కృష్ణా జిల్లాకే కాకుండా పరిసర ప్రాంతాల పేద రోగులకు పెద్ద దిక్కుగా మారనుంది. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన దాతలను అభినందిస్తూ, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో మరిన్ని ఇటువంటి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొత్తంగా కృష్ణా జిల్లాలో సాగిన ఈ పర్యటన అటు శ్రామికులకు భరోసాను, ఇటు గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సౌకర్యాన్ని కల్పించడంలో విజయవంతమైంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వానికి ఈ పరిణామాలు మరింత ఊతాన్ని ఇస్తున్నాయి. నేటి ఆధునిక కాలంలో శ్రామికుల నైపుణ్యాలను పెంచడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మార్చవచ్చని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో ఇటువంటి వైద్య సంస్థల పాత్ర అత్యంత కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఆరుగురు దుర్మరణం
- కర్ణాటక నుంచి వస్తుండగా విషాదం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- ఎగ్జిట్-16 వద్ద ఆగిన ప్రాణాలు




**హైదరాబాద్, మహా:** ఓఆర్ఆర్ పై ఘోరప్రమాదం జరిగింది. అతివేగం, అజాగ్రత్త తోడై ఆరుగురి నిండు ప్రాణాలను బలితీసుకుంది. శంషాబాద్ సమీపంలోని తుక్కుగూడ ఎగ్జిట్ 16 వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో నిమిషాల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన వారు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఒక మహిళ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉండటం అందరినీ కలిచివేస్తోంది. పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుమారు ఎనిమిది మంది వ్యక్తులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి గచ్చిబౌలి పరిసరాల్లో నివాసం ఉంటున్నారు. వీరంతా కర్ణాటకలోని కలబురగి (గుల్బర్గా)లో ఒక శుభకార్యానికి హాజరై, తిరిగి నగరానికి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. తుక్కుగూడ ఎగ్జిట్ 16 వద్ద సాంకేతిక కారణాలతో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని గమనించని కారు డ్రైవర్, అతివేగంతో వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ధాటికి కారు ముందు భాగం పూర్తిగా లారీ కిందకు దూసుకెళ్లి తునాతునకలైంది. ఈ భీకర ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతులను జార్ఖండ్‌కు చెందిన సంతోష్ (32), సునీల్ (28), అతని భార్య, మరో వ్యక్తితో పాటు ఇద్దరు చిన్నారులుగా గుర్తించారు. మృతదేహాలు కారులో ఇరుక్కుపోవడంతో పోలీసులు గ్యాస్ కట్టర్ల సాయంతో వాహనాన్ని కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న మరో మహిళ శాంతి (26) తీవ్ర గాయాలతో బయటపడగా, ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రమాదానికి గురైన కారు (TS 23 F 2298) వేగం సుమారు 120 కిలోమీటర్ల పైమాటేనని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న శంషాబాద్ డీసీపీ మరియు ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఓఆర్ఆర్‌పై వాహనాలు ఆపకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, లారీ అక్కడ ఎందుకు ఆగి ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమా లేక కారు డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని ఢీకొట్టారా అన్నది తేలాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. విషయం తెలిసిన మృతుల బంధువులు, స్నేహితులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు. బతుకుదెరువు కోసం వచ్చి అకాల మరణం పాలవ్వడం ఆ కుటుంబాల్లో తీరని వేదనను నింపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన విచారణ జరుపుతున్నారు.

# ఉజ్వల భవిష్యత్తుకు 'బాల భరోసా' ఒక వరం

## జిల్లా కలెక్టర్ అంకిత్.. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా "బాల భరోస" కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఉజ్వల భవిష్యత్తుకు 'బాల భరోసా' ఒక వరమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్రంలోని రామవరం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి "బాల భరోస" కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలిదశలోనే గుర్తించి నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాల భరోసా' కార్యక్రమం అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పిల్లల్లో ఉండే న్యూరో డెవలప్‌మెంట్ (నాడీ వ్యవస్థ సంబంధిత) సమస్యలు శారీరక ఎదుగుదల లోపాలు మానసిక వికాసంలో ఆలస్యం వంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడం, చిన్నారులు ఆరోగ్యంగా సంతోషంగా పెరిగేలా చూడటమే కాకుండా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు అంగన్వాడి కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కే టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్లైన్ పోర్టర్లలో వివరాలను నమోదు చేయడం జరిగిందని దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్మెంట్ శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం ఈరోజు మాత్రమే చేసుకోకుండా సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు నిర్వహించుకోవాలని అంగనవాడి టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా సంతోషంగా సురక్షితమైన భవిష్యత్తును నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0నుండి 5 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం జరిగింది. తదుపరి "బేటి బచావో" కార్యక్రమంలో భాగంగా "భేటీ జన్మోత్సవ్" నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్, డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కే సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి.సంపత్, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు, అంగనవాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 4వ సారి ఐటీసీ అధికారికి బెస్ట్ మేనేజ్మెంట్ అవార్డు



**బూర్గంపహాడ్ మహా :** ఐటీసీ చీఫ్ వెల్ఫేర్ ఆఫీసర్ కీ మేనేజ్మెంట్ కమిటీ నుండి వరుసగా నాల్గవ సారి గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ నుండి ఐటీసీ భద్రాచలం యూనిట్ కి బెస్ట్ మేనేజ్మెంట్ అవార్డు కు ఎంపికైన సందర్భంగా మల్లాది వెంకట రామారావు కి హర్థిక శుభాకాంక్షలు పలువురు తెలియజేస్తున్నారు. మే డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డును హైదరాబాద్ అందించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక ఐ టి సి కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న వెంకట రామారావు కి ఈ అవార్డు వరించడం తో ఐటీసీ యాజమాన్యం, కార్మికులు,మిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నిబద్ధతతో పని చేస్తే అవార్డులు తప్పకుండా వరిస్తాయని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## సారపాక ఐటీసీ వద్ద కార్మికుల రిలే నిరాహార దీక్షకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంఘీభావం



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ సంస్థ వద్ద 14వ కార్మిక వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐటీసీ కాంట్రాక్ట్ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఈరోజు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన దీక్షలో పాల్గొంటున్న కార్మికులకు సంఘీభావం ప్రకటించి, వారి న్యాయబద్ధమైన డిమాండ్లను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంస్థ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు కూడా పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం మరియు యాజమాన్యం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికులు తమకు న్యాయమైన వేతన ఒప్పందం అమలు అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ దీక్షా శిబిరంలో పలువురు కార్మిక నాయకులు, బీఆర్ఎస్ నాయకులు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో ఘనంగా మేడే వేడుకలు



**బూర్గంపహాడ్, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో 140వ మే డే సందర్భంగా హమాలి, ఆటో, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా మేడే కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపురం సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం ఆయన మేడే ప్రాముఖ్యతను వివరిస్తూ మాట్లాడుతూ, అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం, ఆత్మబలిదానాల ఫలితంగానే నేటి కార్మిక హక్కులు సాధ్యమయ్యాయని తెలిపారు. 12 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కాపాడుకోవడానికి కార్మికులు మేడే స్ఫూర్తితో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికులపై ఉక్కుపాదం మోపుతోందని విమర్శించారు. ఈ నాలుగు లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు కార్మికులు అందరూ కలిసికట్టుగా పోరాడాలని ప్రమాణం చేశారు. లక్ష్మీపురం ఆటో స్టాండ్ వద్ద అన్ని రంగాల కార్మికులతో కలిసి పార్టీ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ గుంటక కృష్ణ, హమాలి కార్మికులు సంతపురి శ్రీను, వెంకటరెడ్డి, సాంబార్ రెడ్డి, వెంకన్న, ఆటో కార్మికులు అప్పారావు, రాములు, నరేష్, భవన నిర్మాణ కార్మికులు ముత్యాల కుమార్, గూడూరు రామభద్రం, వెంకటేశ్వర్ రెడ్డి, మధు, రమేష్, కొండయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సారపాకలో ఘనంగా మే డే వేడుకలు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ సిపిఐ ఆధ్వర్యంలో 141 మే డే ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా సారపాక తాపీ మేస్త్రి హెల్పర్లు అడ్డాలో మేడే జెండాను కార్మికుల తరపున సిపిఐ జిల్లా సమితి సభ్యులు సారపాక పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు మే డేఅరుణ పతాకాన్ని ఎగరవేయడం జరిగింది మరియు బస్టాండ్ సెంటర్లో మే డే అరుణ పథకాన్ని సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఆరో వార్డు సభ్యురాలు భూక్య హైమావతి మేడే పతాకాన్ని ఎగరవేయడం జరిగింది మరియు సారపాక కపర్తి భవనంపై ఏడో వార్డు సభ్యులు గూగుల్ భీమామేడే అరుణ పతాకాన్ని ఎగరవేశారు అలాగే సిపిఐ ఆఫీస్ ముందు అరుణ పథకాన్ని భాస్కర్ నగర్ శాఖ కార్యదర్శి వంకాయలపాటి నాగేశ్వరరావు అరుణ పథకాన్నిఎగరవేశారు అలాగే భాస్కర్ నగర్ రాజీవ్ నగర్ గాంధీ నగర్ కు సెంటర్లో బొగ్గుసూరగడ్డపై మే డే అరుణ పతాకాన్ని కోటమర్తి శ్రీనివాస్ గంట నరసరావు కనితిలక్ష్మి వీర్ల సీతమ్మ మేడే అరుణ పతాకాన్ని ఎగరవేయడం జరిగింది ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మేడే కార్యక్రమానికి హాజరైనటువంటి ప్రతి ఒక్కరికి 141వ మే డే శుభాకాంక్షలు తెలియజేస్తూ మేడే అమెరికా చికాగో నగరంలో 8 గంటల పని దినాల కోసం పోరాడి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రాణాలర్పించిన కార్మికులందరికీ నివాళులర్పిస్తూ వారి ఆశయాల సాధన కొరకు అందరూ కష్టపడి పని చేయాలని వారి ఆశయాలను సాధించాలని మేడే ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు జరుపుకునే గొప్ప రోజని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సుమంత్ వినోద్ రవితేజ. భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు రాస మల్ల శివ నరేంద్ర .శ్రీనివాస్. వీర్ల శివ.తాపీ మేస్త్రీలు హెల్పర్లు ప్లంబర్లు పెయింటర్లు తదితరులు పాల్గొన్నారు

### సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ గెస్ట్ హౌస్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను

## మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ గెస్ట్ హౌస్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ను ఈరోజు జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత - రామకొండారెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. వారితో పాటు మాజీ పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఇరవెండి మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, ఐటీసీ పీఎస్‌పీడీ బీఆర్టీయూ యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి, సారపాక టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను, టౌన్ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మి చైతన్య రెడ్డి, రెడ్డిపాలెం సర్పంచ్ బానోత్ సరోజ, వార్డ్ మెంబర్ కుందులు పెద్దిరెడ్డి, చల్లకోటి పూర్ణచందర్, సానికొమ్ము రామచంద్ర రెడ్డి, కర్రి నాగేశ్వరరావు, బానోత్ శ్రీను, పంగి సురేష్, యరం వెంకటరెడ్డి, నరేష్‌రెడ్డి, బుస్కాని నరేష్ తదితరులు హాజరయ్యారు.అలాగే బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో సమావేశమై పలు స్థానిక, పార్టీ సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకై పోరాటం



- లేబర్ కోడ్ లు కార్మికుల మెడకు ఉరితాళ్లు
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల రక్షణకై మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలో పలు చోట్ల జెండావిష్కరణలు జరిపిన అనంతరం సిపిఎం కార్యాలయం వద్ద జెండావిష్కరణ కార్యక్రమాన్ని మేడే సభను నిర్వహించారు. ముందుగా కార్యాలయంపై మచ్చ వెంకటేశ్వర్లు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూట నలభై సంవత్సరాల క్రితం కార్మికలోకం కదంతొక్కి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకుందని వారి త్యాగాలకు పోరాటాలకు చిహ్నం మేడే అని ఆయన తెలియజేశారు. 140 ఏళ్ల క్రితం ఎనిమిది గంటల పని విధానం కావాలని కార్మిక లోకం పోరాడి ప్రాణ త్యాగాలు చేసి ఎనిమిది గంటల పని విధానంతో పాటు కార్మికులకు హక్కులు సాధించి పెట్టారని ఆయన గుర్తు చేశారు. కానీ నేడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం మేడే స్ఫూర్తిని దెబ్బతీసి తిరిగి మళ్ళీ కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మిక చట్టాలను రద్దు చేసిందని ఆయన ధ్వజమెత్తారు. కార్మిక చట్టాల రద్దు వలన కార్మికుల గొంతు నొక్కే కుట్రలు సాగించడమే అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు కార్మికుల మెడకు ఉరితాళ్లు వంటివని ఆయన అన్నారు. కేరళలో ఉన్న వామ పక్ష ప్రభుత్వ మాత్రమే తమ రాష్ట్రంలో పని గంటల పెంపును అమలు చేయమని లేబర్ కోడులను అమలు చేయమని తీర్మానం చేసిందని కానీ మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలకు తలొగ్గి ఈ రాష్ట్రంలో 10 గంటల పని విధానాన్ని తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల సాధనకై తిరిగి మరో చికాగో పోరాటానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. వామపక్షాల పాలనలో భూతల స్వర్గాన్ని తలపించే విధంగా సంక్షేమాన్ని అభివృద్ధిని చేసి చూపించామన్నారు. అనేక అడ్డంకులు ఎదురైనా మార్క్స్ఏంగెల్స్ మౌలిక సిద్ధాంతానికి అనుగుణంగా పాలన సాగించామని వారి ఆశయాల అమలుకు నిరంతరం శ్రమించామన్నారు. ప్రస్తుత కాలంలో వామపక్షాలకు బలం తగ్గినా ఆదరణ తగ్గలేదని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు సామ్రాజ్యవాద పతనానికి దారితీస్తున్నాయని అందుకు నిదర్శనం అమెరికాఇజ్రాయిల్ వైఖరే కారణమన్నారు. గత కొంత కాలంగా సాగినా ఇరాన్అమెరికా యుద్ధంలో ట్రంప్ ప్రపంచ వ్యాప్తంగా అపఖ్యాతి మూటకట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కానీ మోడీ ట్రంప్‌కు బానిసగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా కుటిల రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తున్నారని ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి అనైతికంగా ఆప్ ఎంపీలను బీజేపీలోకి ఆహ్వానించారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నాయకులు నందిపాటి రమేష్, జనుమాల నగేష్, సూరం ఐలయ్య, ఎస్ లక్ష్మి, ఆలేటి శ్రీను, కే హెచ్ ప్రసాద్, రాజారావు, వై.వెంకటేశ్వరరావు, ఎమ్మెస్ ప్రకాష్, సుదర్శన్, సమ్మయ్య, లింగయ్య, నాగకృష్ణ, దుర్గమ్మ, బాలకృష్ణ, రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల పునర్దన కోసం మే డే స్ఫూర్తితో పోరాటాలు...!

- మోదీ హయాంలో కొనసాగుతున్న కార్మిక నిర్బంధకాలం
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్
- మతం పేరుతో కార్మికులను విభజించి హక్కులను కాజేస్తున్న మోదీ !
- సిఐటియు సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి
- సిఐటియు, సిపిఐ ఎం ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు



మతం పేరుతో కార్మికులను విభజించి హక్కులను కాజేస్తున్న మోదీ

**భద్రాచలం మహా :** కేంద్రంలో ఎన్డీఏ అధికారం చేపట్టాక కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కోడ్లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను మోదీ కాలరాశారని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ఆరోపించారు. మే డే స్ఫూర్తితో కార్మిక చట్టాల పునర్దన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏజె రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం 140 వ మే డే ఉత్సవాలను పట్టణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక చంద్రరావు భవనంలో సిఐటియు భద్రాచలం పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన కార్మిక సదస్సులో ఏజే రమేష్ పాల్గొని మాట్లాడారు. మేడే 140 సంవత్సరాల చరిత్రలో ఇంత నిర్బంధం ఎప్పుడు ఎవరు చూసి ఉండరని అన్నారు. చట్టాల స్థానంలో కోడ్లను తీసుకువచ్చి కార్మికులు స్వేచ్ఛగా కార్మిక దినోత్సవం కూడా చేసుకోకుండా మోడీ నిరంకుశంగా అడ్డుపడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లోనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పయనిస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి కార్మికులతో 12 గంటల ఎట్టి చాకిరి చేపిస్తున్నారని అన్నారు. చికాగో నగరంలో ఎనిమిది గంటల పని కోసం కార్మికులు తమ ప్రాణాలను అర్పించి సాధించుకున్నారని వారి స్ఫూర్తితోనే మేడే ఆనాడు ప్రారంభమైందని గుర్తు చేశారు. మరోసారి మే డే స్ఫూర్తితో నిరంకుశ మోడీ సర్కార్ కి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించకుండా మతం మత్తు జల్లి కార్మికులను మతం పేరుతో విభజించి కార్మికుల హక్కులను మోది కాజేస్తున్నారని నర్సారెడ్డి ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తుల కోసమే ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పనినీ తీసుకువచ్చారని ఆరోపించారు. కార్మిక సమస్యలపై ప్రశ్నించేందుకు యూనియన్ లేకుండా చేసి శ్రమ దోపిడీకి మోడీ పాల్పడుతున్నారని అన్నారు. మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వత్తాసుపలకటం దుర్మార్గమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం మోడీ తీసుకు వచ్చిన కోడ్లను అత్యంత వేగంగా అమలు చేస్తున్నారని అన్నారు. హక్కులను కోల్పోతే కార్మిక తిరుగుబాటు తప్పదని ఆ తిరుగుబాటులో మోడీతో పాటు ఆయనకు భజన పలుకుతున్న అన్ని బూర్జువ పార్టీలు కార్మిక ఆగ్రహానికి గురి అవ్వటం ఖాయమని నర్సారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గడ్డం స్వామి కొలగాని రమేష్ నకిరేకంటి నాగరాజు పారెల్లి సంతోష్ కుమార్ డి రామకృష్ణ లక్ష్మణ్ చంద్ర లీల శివకుమారి తదితరులు పాల్గొన్నారు. మే డే సందర్భంగా పట్టణంలోని అన్ని కార్మిక కూడళ్ల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణలను నిర్వహించారు ఆటో కార్మికులు పళ్ళ వర్తక సంఘం నాయకులు షాప్ ఎంప్లాయిస్ చిన్నపాటి లారీ ట్రాన్స్పోర్ట్ కార్మికులు ఇండస్ట్రియల్ కార్మికులు ముఠా సంగాల కార్యకర్తలు మేడే ర్యాలీలో భారీగా పాల్గొన్నారు.

## మే డే వేడుకల్లో జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, మహా :** కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా మణుగూరు మండలం సిఎస్‌పి వద్ద బొగ్గు ముఠా వర్కర్స్ కార్యాలయం, కోల్ ట్రాన్స్ పోర్ట్ గుమస్తాల సంఘం కార్యాలయాల్లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరించారు. కార్మికుల సేవలను స్మరించుకుంటూ వారి హక్కులు, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. కార్మికుల ఐక్యతే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు.కాంగ్రెస్‌లో చేరిక..ఈ సందర్భంగా కోల్ ట్రాన్స్ పోర్ట్ గుమస్తాల సంఘానికి చెందిన ముగ్గురు గుమస్తాలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆత్మీయంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కోల్ ట్రాన్స్ పోర్ట్ గుమస్తాల సంఘం నాయకులు, బొగ్గు ముఠా వర్కర్లు, 14 టైర్ యూనియన్ నాయకులు, 16 టైర్ యూనియన్ నాయకులు, నియోజకవర్గ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, డ్రైవర్లు, కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐటీసీ పీఎస్‌పీడీ కాంట్రాక్ట్ కార్మికుల ఆవేదన

### ప్రజా ప్రతినిధులు స్పందించాలని జేఏసీ డిమాండ్



**బూర్గంపహాడ్ మహా :** పినపాక నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులపై ఐటీసీ పీఎస్‌పీడీ కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో పనిచేస్తున్న 4 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంపై వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 14వ వేతన ఒప్పందం అమలులో జాప్యం జరుగుతుండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఈరోజుతో 37వ రోజుకు చేరుకున్నాయని కార్మికులు పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎన్నికల సమయంలో మాత్రమే మా వద్దకు వచ్చి హామీలు ఇస్తారు. ఎన్నికలు పూర్తయ్యాక మా సమస్యలు గుర్తుకురావా? మా కష్టాలు మీ దృష్టికి రావడం లేదా?" అంటూ కాంట్రాక్ట్ కార్మికులు ప్రశ్నించారు. స్థానిక సర్పంచులు, వార్డ్ సభ్యులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావాలని ఐటీసీ పీఎస్‌పీడీ కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ డిమాండ్ చేసింది. కార్మికుల శ్రమతోనే సంస్థ నడుస్తోందని, వారి హక్కులను పరిరక్షించడం ప్రతి ప్రజా ప్రతినిధి బాధ్యత అని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## గూగులోత్ శివరాం కిషోర్ నాయక్

### శ్రావణి ప్రియ వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో గురువారం ఘనంగా నిర్వహించిన గూగులోత్ వీరస్వామి - విజయలక్ష్మి దంపతుల కుమారుడు సారపాక పంచాయతీ సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్ మరియు శ్రావణి ప్రియ వివాహ వేడుకకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన దంపతులను ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను ఆత్మీయంగా అభినందిస్తూ, నూతన జంటకు భవిష్యత్తులో అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## శ్రమశక్తి పురస్కారం అందుకున్న కార్మిక నాయకుడు యారం పిచ్చి రెడ్డి



**బూర్గంపహాడ్ మహా :** తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల మండలి సభ్యుడు, రాష్ట్ర కార్మిక నాయకుడు, ఐటీసీ పీఎస్‌పీడీ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చి రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యున్నత, ప్రతిష్టాత్మకమైన *"శ్రమశక్తి పురస్కారం"*ను అందుకున్నారు. మే డే సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఈ పురస్కారం ఆయనకు ప్రదానం చేయబడింది. కార్మికుల శ్రేయస్సు కోసం రాజీలేని పోరాటం చేస్తూ, నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు గాను ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా యారం పిచ్చి రెడ్డి మాట్లాడుతూ, "ఈ రోజు నా జీవితంలో అత్యంత గొప్ప క్షణం. కార్మికుల ప్రతి శ్రమకు గుర్తింపుగా 'శ్రమశక్తి అవార్డు' నాకు లభించిందని నేను భావిస్తున్నాను. ఈ అవార్డు నాది మాత్రమే కాదు - ఇది మన అందరిది. మీ అందరి సహాయ సహకారంతోనే నాకు ఈ గొప్ప గుర్తింపు సాధ్యమైంది" అని అన్నారు.కార్మిక నాయకుడిగా తాను కార్మికులతో కలిసి పనిచేస్తూ, వారి శ్రమను గమనిస్తూ, వారి ఆకాంక్షలకు తోడ్పడుతూ యాజమాన్యంతో పోరాడుతున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా కార్మికుల శ్రేయస్సు కోసం తన ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ మరియు కార్మిక వర్గానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

# అసాధారణ ప్రతిభకు కేరాఫ్ సీవీ ఆనంద్

**ఒక్కో మెట్టు ఎక్కి..ఉన్నత శిఖరాన్ని అధిరోహించి.. పరిపాలనలో విజనరీ.. కొత్త డీజీపీ సీవీ ఆనంద్ ప్రస్థానం... అసాధారణ ప్రతిభకు కేరాఫ్... చదువులో టాపర్... క్రీడల్లో చాంపియన్... పరిపాలనలో విజనరీ...అన్నింటినీ సమపాళ్లలో మేళవించుకున్న అరుదైన వ్యక్తిత్వం కొత్త డీజీపీ సీవీ ఆనంద్ సొంతం. కష్టాన్ని అవకాశంగా మలుచుకోవడం, లక్ష్యాన్ని సాధించే వరకు వెనుకడుగు వేయకపోవడం, విధుల్లో నిబద్ధతకు కట్టుబడి ఉండడం ఈ మూడు లక్షణాలు ఆయనను సాధారణ అధికారిగా కాకుండా ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టాయి. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ వరకు దాదాపు మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకం. పోలీస్ వ్యవస్థకు మార్గదర్శకం. ఇప్పుడు రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ఈ విజనరీ అధికారి ప్రజలకు మరింత సమర్థవంతమైన, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను అందించనున్నారు.**



### సీవీ ఆనంద్ నేపథ్యం..

సివి ఆనంద్ జూన్ 5, 1968న హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు చామ దామోదర్ రెడ్డి, యశోదా దేవి. రంగారెడ్డి జిల్లా కుంట్లూరు గ్రామం నుంచి నగరానికి వలస వచ్చిన ఈ కుటుంబం క్రమశిక్షణ, విలువలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఆయన తండ్రి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ హోదాలో సేవలందించి పదవి విరమణ పొందారు. ఐదుగురు కుమారులలో ఆనంద్ చిన్నవారు. పెద్దన్న వినోద్ భారత వాయుసేనలో ఫైటర్ పైలెట్‌గా సేవలందిస్తూ మిగ్21 ప్రమాదంలో వీరమరణం పొందడం ఆ కుటుంబం చేసిన గొప్ప త్యాగం

### విద్యాభ్యాసం – క్రీడల్లో ప్రతిభ..

సీవీ ఆనంద్ చిన్ననాటి నుంచే ప్రతిభావంతుడు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, విద్యారణ్యలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసి చదువులో ఎప్పుడూ అగ్రస్థానంలో నిలిచారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో పాఠశాల స్థాయిలోనే ప్రథమ స్థానాలు సాధించారు. క్రీడల్లోనూ ఆయన అదే స్థాయి ప్రతిభ కనబరిచారు. 1986లో హైదరాబాద్ అండర్19 క్రికెట్ జట్టుకు ఎంపికై ఇంగ్లాండ్ పర్యటనలో పాల్గొన్నారు. సికింద్రాబాద్ క్లబ్ తరపున ఆడుతూ ఐదు సెంచరీలు సాధించారు. 2019లో అఖిల భారత టెన్నిస్ టోర్నీలో ప్రథమ స్థానం సాధించడం ఆయన బహుముఖ ప్రతిభకు నిదర్శనం. నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ (ఎకనామిక్స్) పూర్తి చేశారు. రంజీ ట్రోఫీ అవకాశాన్ని తృటిలో కోల్పోయినా అదే పట్టుదలతో కేవలం 22 ఏళ్ల వయసులోనే సివిల్ సర్వీసెస్ సాధించి 1991 బ్యాచ్ అధికారిగా ఎంపిక కావడం ఆయన జీవితంలో కీలక మలుపు.

### వ్యక్తిగత జీవితం..

1993లో లలిత ఆనంద్ గారిని వివాహం చేసుకున్నారు. వారి పెద్ద కుమారుడు మిలింద్ ఆనంద్ క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంటూ హైదరాబాద్ సీనియర్ జట్టుకు కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు నిఖిల్ యానిమేషన్, వీఎఫ్ఎక్స్ రంగంలో ఉన్నారు. 57 ఏళ్ల వయసులోనూ సీవీ ఆనంద్ అత్యంత ఫిట్‌గా ఉండటం విశేషం. టెన్నిస్, గోల్ఫ్, క్రికెట్‌లను నిరంతరం ఆడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటారు. బిజీ షెడ్యూల్ మధ్య కూడా క్రీడలకు సమయం కేటాయించడం ఆయన జీవనశైలిని ప్రతిబింబిస్తుంది. 202526 క్రికెట్ సీజన్‌లో ఐదు సెంచరీలు సాధించడం ఆయన అద్భుత ఫిట్‌నెస్‌కు నిదర్శనం.

### పోలీసు శాఖలో సాహసోపేత సేవలు..

సీవీ ఆనంద్ తన కెరీర్ ప్రారంభ దశలోనే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తొమ్మిదేళ్లు పనిచేశారు. బెల్లంపల్లి, వరంగల్, నిజామాబాద్ ప్రాంతాల్లో ప్రత్యక్షంగా ఆపరేషన్లలో పాల్గొని శాంతిభద్రతలు కాపాడారు. ఈ సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి వీరత్వ పతకం అందుకున్నారు.విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో రౌడీయిజాన్ని కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించారు. సీఐడీ అధికారిగా థాయిలాండ్ నుంచి కృషి బ్యాంక్ స్కాం నిందితుడిని రప్పించడం ఆయన దృఢ సంకల్పాన్ని చూపించింది.

### పోలీసింగ్‌లో విప్లవాత్మక సంస్కరణలు..

హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు ఆయన ప్రవేశపెట్టిన ఈచలాన్ విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థలు నేటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయి.సైబరాబాద్ కమిషనర్‌గా మహిళల భద్రత కోసం షీ టీమ్స్, షీ షటిల్స్ వంటి వినూత్న కార్యక్రమాలు ప్రారంభించారు. సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ద్వారా పారిశ్రామిక రంగంపోలీసింగ్ అనుసంధానం సాధించారు.

### 12 రాష్ట్రాలకు ఆదర్శం..

సివిల్ సప్లై కమిషనర్‌గా ఈపాస్, జీపీఎస్ ట్రాకింగ్ వంటి ఐటీ సంస్కరణలు అమలు చేసి దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. కేంద్ర సేవల్లో ఐజీగా దేశంలోని విమానాశ్రయాల భద్రతను పర్యవేక్షించడమే కాకుండా నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీని అత్యుత్తమ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక ఆధారిత చర్యలు చేపట్టారు. పారదర్శక పోలీసింగ్‌కు ఆయన పెట్టిన పునాది నేటి ఆధునిక పోలీసింగ్‌కు మార్గదర్శకంగా నిలుస్తోంది.

### ఆయన నిర్వహించిన కీలక పదవులు..

సివి ఆనంద్ ప్రస్థానం ఒకే చోట పరిమితం కాలేదు. వివిధ ప్రాంతాల్లో విభిన్న బాధ్యతల్లో పనిచేస్తూ విస్తృత అనుభవాన్ని సంపాదించుకున్నారు. ప్రతి పోస్టింగ్‌లో తనదైన ముద్ర చాటుకున్నారు. వరంగల్ రూరల్ ఏఎస్పీ (1992-94) - మావోయిస్టు ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణవిజయవాడ పోలీస్ కమిషనర్ (2007-08) - ట్రాఫిక్, నగర పోలీసింగ్‌లో క్రమశిక్షణ రౌడీయిజం పై ఉక్కుపాదం.. పోలీసులను చూస్తేనే రౌడీలు వనికే పరిస్థితి తెచ్చారు.

ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ (2009-10) - అక్రమ మద్యం నియంత్రణలో కఠిన చర్యలు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (2013-16) - సైబర్ క్రైమ్ నియంత్రణ, ఐటీ కారిడార్ భద్రత

పౌరసరఫరాల సంస్థ ఎండీ (2016-18) - EPOS, GPS సంస్కరణలు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (2021-23) - మెట్రో పోలీసింగ్‌లో సంస్కరణలు

విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ డీజీ (2024) - అవినీతి నిరోధక చర్యలు

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (2025-26) - భద్రతా విధానాల్లో కీలక నిర్ణయాలు

### పురస్కారాలు – గుర్తింపులు..

సీవీ ఆనంద్ సేవలకు గుర్తింపుగా అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

ప్రెసిడెంట్ గ్యాలంట్రీ అవార్డు (2002)

ఇండియన్ పోలీస్ మెడల్ (2007)

ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ (2017)

నేషనల్ ఈగవర్నెన్స్ అవార్డు (201718)

వరల్డ్ పోలీస్ సమ్మిట్ అవార్డు, దుబాయ్ (2025)

సాధారణ కుటుంబం నుంచి ప్రారంభమైన సీవీ ఆనంద్ ప్రయాణం అసాధారణ విజయగాథగా మారింది. కష్టపడి సాధించిన ప్రతి మెట్టు ఆయన వ్యక్తిత్వాన్ని మరింత పదును పెట్టింది. సాహసం, సంస్కరణలు, సాంకేతిక దృష్టి—ఈ మూడు ఆయుధాలతో ఆయన పోలీసింగ్‌కు కొత్త దిశ చూపించారు. ఇప్పుడు డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయన, తన అనుభవం, దూరదృష్టితో తెలంగాణ పోలీస్ వ్యవస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రజల పక్షాన నిలిచే నిష్పాక్షిక అధికారిగా ఆయన ప్రయాణం ఇంకా ఎన్నో విజయాలతో ముందుకు సాగాలని మనసారా కోరుకుందాం.



- గొట్టిముక్కుల బ్రహ్మాచారి
సీనియర్ జర్నలిస్టు , 9441884389

# చైనా రియల్ ఎస్టేట్ ఢమాల్

**20 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా పడిపోయిన ఆస్తివిలువ**

**కుప్పకూలిన కలల సౌధం**



(మహా స్పెషల్ )

ఒకప్పుడు చైనా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన రియల్ ఎస్టేట్ రంగం, ఇప్పుడు ఆ దేశానికే పెనుభారంగా మారింది. ఆకాశాన్నంటే భవనాలు, సరికొత్త నగరాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన చైనాలో ఇప్పుడు 'ఘోస్ట్ టౌన్స్' దర్శనమిస్తున్నాయి. చైనాలో రియల్ ఎస్టేట్ సంక్షోభం రోజురోజుకు పెరుగుతోంది. గతంలో ఆ దేశ జీడీపీలో 25 శాతం రియల్ స్టేట్ రంగం వాటానే ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం పరిస్థితులు మారిపోయాయి. గత 20 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా ఆస్తి విలువలు దారుణంగా పడిపోయాయి. ఓవైపు ఇన్వెస్టర్లు మరోవైపు సామాన్య ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి రియల్ ఎస్టేట్ ప్రకంపనలు భారత్‌కు కూడా వచ్చే ఛాన్స్ ఉందా అనేదానిపై చర్చ నడుస్తోంది. బీఐఎస్ డేటా ప్రకారం చూసుకుంటే చైనాలో 2021లో గృహ ధరల సూచిక 113 పాయింట్లుగా ఉండేది. 2025 చివరి నాటికి 86.79 పాయింట్లకు పడిపోయింది. నాలుగేళ్లలోనే దాదాపు 25 శాతం సంపద నష్టం జరిగింది. చైనాలో ఇప్పుడు 391 మిలియన్ చదరపు మీటర్ల వరకు ఇళ్లు అమ్ముడుపోక ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 2021తో పోలిస్తే ఇది 72 శాతం ఎక్కువ. 2025లో మొదటి 10 నెలల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు 14.7 శాతానికి పడిపోయాయి.

### సంక్షోభానికి ప్రధాన కారణాలు ఏమిటి?

చైనా రియల్ ఎస్టేట్ పతనానికి కేవలం ఒక్క కారణం లేదు, దశాబ్దాలుగా పేరుకుపోయిన వైఫల్యాలు ఇప్పుడు బయటపడుతున్నాయి:

**అప్పుల ఊబి:**
'ఎవర్‌గ్రాండే' వంటి దిగ్గజ సంస్థలు తమ సామర్థ్యానికి మించి అప్పులు చేసి ప్రాజెక్టులు చేపట్టాయి. ప్రభుత్వం 'త్రీ రెడ్ లైన్స్' పేరుతో అప్పులపై కఠిన నిబంధనలు తేవడంతో, ఈ సంస్థల వద్ద నగదు లభ్యత తగ్గి ప్రాజెక్టులు నిలిచిపోయాయి.

**అమ్మకం కాని ఇళ్లు:**
ప్రస్తుతం చైనాలో సుమారు 391 మిలియన్ చదరపు మీటర్ల నివాస ప్రాంతం అమ్ముడుపోకుండా ఖాళీగా ఉంది. అంటే కోట్లాది మందికి సరిపడా ఇళ్లు నిర్మించినా, కొనే నాథుడే లేడు. ఇళ్లు కొన్నవారికి డెలివరీ సకాలంలో అందకపోవడం, కంపెనీలు దివాళా తీయడంతో సామాన్య ప్రజలు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడానికి భయపడుతున్నారు.

**జనాభా తగ్గుదల:**
చైనాలో జననాల రేటు తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల గృహాలకు డిమాండ్ సహజంగానే పడిపోయింది.

**భారత్‌పై ప్రభావం ఉంటుందా?**
చైనా పరిస్థితి చూసి భారతీయ ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. అయితే, చైనాకు, భారత్‌కు మధ్య ఉన్న కీలక వ్యత్యాసాలను ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు:

**డిమాండ్ మరియు సరఫరా:**
చైనాలో అవసరానికి మించి ఇళ్లు కట్టేశారు . కానీ భారత్‌లో పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ వల్ల ఇళ్లకు ఇంకా భారీగా డిమాండ్ ఉంది. భారత్‌లో రెరా వంటి చట్టాలు ఉండటం వల్ల డెవలపర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం తక్కువ. కొనుగోలుదారుల సొమ్ముకు భద్రత ఉంది.

**పెట్టుబడి ధోరణి:**
చైనాలో ప్రజలు తమ పొదుపులో 70% రియల్ ఎస్టేట్‌లోనే పెట్టేవారు. భారతీయులు బంగారం, స్టాక్ మార్కెట్, ఎఫ్‌డీల వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులను విస్తరించారు. చైనా రియల్ ఎస్టేట్ సంక్షోభం మనకు ఒక హెచ్చరిక. విచ్చలవిడి అప్పులు, అసంబద్ధమైన రేట్ల పెంపు ఏ దేశానికైనా ప్రమాదకరమే. భారత్‌లో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ నిలకడగా ఉన్నప్పటికీ, రూపాయి విలువ క్షీణత మరియు ఆర్థిక ఒడిదుడుకుల దృష్ట్యా ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండటం అవసరం.



# వడదెబ్బ మీ దరిచేరదు

తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత మొదలై, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఇలాంటి సమయంలో కేవలం గొంతు ఎండిపోయినప్పుడు నీళ్లు తాగడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ అనేది అకస్మాత్తుగా వచ్చేది కాదని, మన శరీరంపై రోజువారీగా పడే వేడి ప్రభావం ఒక స్థాయికి చేరినప్పుడు అది ప్రాణాంతకంగా మారుతుందని ముంబైలోని హీరానందని హాస్పిటల్ ఇంటర్నల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ విమల్ పహూజా విశ్లేషించారు.

**వడదెబ్బను నివారించే మూడు కీలక అలవాట్లు**
వడదెబ్బ అనేది ఒకే రోజులో సంభవించే ప్రమాదం కాదు. రోజురోజుకూ శరీరంలో పేరుకుపోయే ఉష్ణోగ్రత ఒత్తిడి దీనికి కారణం. దీన్ని నివారించడానికి డాక్టర్ పహూజా మూడు సులభమైన సూత్రాలను ప్రతిపాదించారు:

**సమయపాలన:**
ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. పనులన్నీ తెల్లవారుజామున లేదా సాయంత్రం వేళల్లోనే ముగించుకోవాలి.

**జీర్ణక్రియపై శ్రద్ధ:**
వేసవిలో ఒకేసారి భారీగా భోజనం చేయడం ప్రమాదకరం. తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి. భారీ భోజనం చేస్తే, శరీరం దాన్ని అరిగించడానికి రక్త ప్రసరణను పొట్ట వైపు మళ్లిస్తుంది. దీనివల్ల చర్మం ద్వారా వేడిని బయటకు పంపే ప్రక్రియ మందగిస్తుంది.

**శరీరాన్ని చల్లబరచడం:**
రోజూ పది నిమిషాల పాటు చన్నీటి స్నానం చేయడం లేదా మణికట్టు, మెడ వంటి పల్స్ పాయింట్లపై తడి గుడ్డతో తుడుచుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత తక్షణమే తగ్గుతుంది.

**నీళ్లు తాగే విషయంలో ఈ పొరపాట్లు వద్దు!**
శరీరానికి నీరు అందించడం (Hydration)లో మనం చేసే చిన్న చిన్న తప్పులే పెద్ద సమస్యలకు దారితీస్తాయి. "దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం అంటే అప్పటికే మీ శరీరం 12 శాతం డీహైడ్రేషన్ బారిన పడిందని అర్థం. కాబట్టి దాహం వేయకముందే నీరు తాగుతూ ఉండాలి" అని డాక్టర్ విమల్ పేర్కొన్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఉదయం లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ, ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు బెడ్ కాఫీకి బదులుగా 400500 మి.లీ. నీటిని తాగాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అలాగే మధ్యాహ్న సమయాల్లో కేవలం నీరు మాత్రమే కాకుండా కొబ్బరి నీళ్లు లేదా ఓఆర్ఎస్ (ORS) తీసుకోవడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది.

**ఎవరు జాగ్రత్తగా ఉండాలి?**
అధిక బరువు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారిలో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. అలాగే బీపీ మందులు వాడేవారు కూడా వేడికి త్వరగా ప్రభావితమవుతారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లలు, ఎండలో పని చేసే కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

**మంచు లాంటి చల్లటి నీళ్లు తాగుతున్నారా?**
వేసవిలో ఫ్రిజ్ లోని చల్లటి నీళ్లు తాగడం హాయిగా అనిపించినా, అది ఆరోగ్యానికి మంచిది కాదు. అత్యధిక చల్లదనం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి, శరీరానికి నీరు అందే ప్రక్రియ ఆలస్యమవుతుంది. గది ఉష్ణోగ్రత వద్ద ఉండే నీరు లేదా కుండ నీళ్లు తాగడం వల్ల శరీరం త్వరగా రీహైడ్రేట్ అవుతుంది. అలాగే ఎండ తీవ్రత 38 డిగ్రీలు దాటినప్పుడు ఫ్యాన్లు కేవలం వేడి గాలినే తిప్పుతాయి, దీనివల్ల శరీరం నుంచి తేమ ఆవిరైపోతుందే తప్ప చల్లదనం లభించదు. చెమట పట్టడం ఆగిపోవడం అనేది వడదెబ్బకు అతిపెద్ద హెచ్చరిక. అలాంటి పరిస్థితి కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తరలించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మామిడి పండ్లు.. ఇలా తింటేనే రుచితో పాటు ఆరోగ్యం!



తీపి, పులుపు కలగలిసిన మామిడి పండును షేక్స్, డెజర్ట్స్ లేదా భోజనం తర్వాత నేరుగా తినడానికి చాలామంది ఇష్టపడతారు. కానీ, మామిడి పండు సహజంగానే శరీరంలో వేడిని పెంచే గుణాన్ని కలిగి ఉంటుంది. సరైన పద్ధతిలో తీసుకోకపోతే నోటి పూత, ఎసిడిటీ లేదా కడుపులో మంట వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యల నుంచి తప్పించుకుని మామిడి పండు రుచిని ఆస్వాదించాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

### మామిడి పండ్లను నీళ్లలో ఎందుకు నానబెట్టాలి?

చాలామంది మార్కెట్ నుంచి తెచ్చిన పండ్లను అలాగే తినేస్తుంటారు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదు! మామిడి పండ్లను తినడానికి కనీసం 30 నిమిషాల నుంచి రెండు గంటల ముందు శుభ్రమైన నీటిలో నానబెట్టాలి. ఉష్ణోగ్రత నియంత్రణ: నీళ్లలో నానబెట్టడం వల్ల పండ్లలోని సహజమైన వేడి తగ్గుతుంది. రసాయనాల తొలగింపు: పండ్లను త్వరగా పండించేందుకు వాడే కార్బైడ్ వంటి రసాయనాలు నీటిలో నానబెట్టడం వల్ల తొలగిపోతాయి. జీర్ణక్రియ: ఇలా చేయడం వల్ల ఎసిడిటీ సమస్య రాదు, చర్మంపై మొటిమలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.

### మామిడి పండ్లను తినేటప్పుడు పాటించాల్సిన 5 సూత్రాలు..

**1. శుభ్రంగా కడగాలి:**
నానబెట్టిన తర్వాత పండ్లను ప్రవహించే నీటి కింద పెట్టి మరోసారి కడగాలి. తొక్కతో సహా తినే అలవాటు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

**2. భోజనం తర్వాత వెంటనే వద్దు:**
భారీగా భోజనం చేసిన వెంటనే మామిడి పండు తింటే కడుపు ఉబ్బరం (బ్లోయింగ్) లేదా అజీర్తి కలిగే అవకాశం ఉంది. భోజనానికి, పండు తినడానికి మధ్య కొంత సమయం ఉండేలా చూసుకోండి.

**3. చలవ చేసే వస్తువులతో కలిపి...:**
మామిడి పండు తిన్నప్పుడు శరీరంలో పెరిగే వేడిని తగ్గించడానికి పెరుగు, పుదీనా లేదా మజ్జిగ వంటి వాటిని ఆహారంలో భాగంగా తీసుకోవాలి. ఇది జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది.

**4. సహజంగా పండినవే మేలు:**
కెమికల్స్‌తో పండించినవి నీటిపై తేలుతాయి, సహజంగా పండిన పండ్లు నీటిలో మునుగుతాయి. ఈ చిన్న పరీక్షతో నాణ్యమైన పండ్లను గుర్తించవచ్చు.

**5. అతిగా తినకండి:**
రుచిగా ఉంది కదా అని ఒకేసారి ఎక్కువ పండ్లు తినకూడదు. ఏదైనా మితంగా తీసుకుంటేనే ఆరోగ్యం. అతిగా తింటే జీర్ణవ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. సమ్మర్ ఇచ్చే తియ్యని కానుక మామిడి పండు! మన పెద్దలు చెప్పిన ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తూ మామిడి పండును తింటే, ఎండకాలం వేడిని తట్టుకుంటూనే సీజన్ ఫ్రూట్‌ను హాయిగా ఆస్వాదించవచ్చు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### ఎస్ఎస్సీ టాపర్లను ఘనంగా సత్కరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ మహా;**విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో, మార్చి 2026లో నిర్వహించిన ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని 17 ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టాపర్ విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, ఎస్ఎస్సీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయం జీవిత ప్రయాణంలో మొదటి మెట్టు మాత్రమేనని పేర్కొంటూ, తమ అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా భవిష్యత్తు కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, స్వయంగా తమ లక్ష్యాలను నిర్ణయించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. అదే పట్టుదల, కృషిని ఇంటర్మీడియట్ చదువులో కూడా కొనసాగిస్తే మరింత ఉన్నత విజయాలు సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలిచేలా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగి, రాబోయే విద్యా సంవత్సరాల్లో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రేరణ కలిగిందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు భావోద్వేగంతో మాట్లాడుతూ.. తమ విజయాల వెనుక ఉన్న అసలైన శక్తి ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం ఉందని వారు పేర్కొన్నారు. వారి మార్గదర్శకం, సహనం, వల్లే ఈ స్థాయికి చేరగలిగామని కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ విధంగా సన్మానం పొందడం తమకు గొప్ప గౌరవంగా భావిస్తున్నామని, ఇది తమ భవిష్యత్ లక్ష్యాల సాధనకు మరింత ప్రేరణ నిచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఏఎంఓ డా. బందారు మన్మోహన్, ఇతర అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా బాల భరోసా కార్యక్రమం

### పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్



**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 5వ థీమ్‌గా 'చైల్డ్ సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ "డ్రగ్స్‌కు నో" అనే అంశం పై ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.ఈ నేపథ్యంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్య , ఆరోగ్య శాఖల సమన్వయంతో శుక్రవారం ఓ సిటీ స్టేడియం లో 'బాల భరోసా' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరైయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాలలకు భరోసా ఎంతో అవసరం అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంతేకాకుండా గర్భిణీలు తో పాటు పాలిచ్చే తల్లులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. సరైన పోషణ ఉన్నప్పుడే పిల్లలు శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు.పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ చిన్నారులకు ముందస్తుగా హెల్త్ స్క్రీనింగ్ చేయించడం ద్వారా అభివృద్ధి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించవచ్చని అన్నారు. అందువల్ల పిల్లలకు నిరంతర ఆరోగ్య పరీక్షలు చేయించడం అత్యంత అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ నగర సంకీర్తిన ఊరేగింపు

### పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



**మహా వరంగల్ బ్యూరో;**వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి హనుమాన్ భక్తమండలి అన్నదాన సేవ సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ వారి సహకారంతో శ్రీ హనుమాన్ నగర సంకీర్తిన ఊరేగింపు కార్యాక్రమం చేయడం జరిగింది.ఈ ఊరేగింపులో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ స్వామి వారికీ ప్రత్యేక పూజలు చేసి, హనుమాన్ రథమును హనుమాన్ స్వాములతో కలిసి స్వామి వారిని ఊరేగించారు .అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి అన్నదాన సేవ సమితి సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు మోతిలాల్ నాయక్, యెలుగం సత్యనారాయణ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు దాసరి రాజేష్, తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కొండా సురేఖ
- లక్ష్మీపురం మార్కెట్ లో ఘనంగా "మే"డే వేడుకలు
- జెండా ఆవిష్కరించిన మంత్రి, జిల్లా కలెక్టర్



**మహా వరంగల్ బ్యూరో;**మే డే కార్మికుల దినోత్సవం సందర్భంగా లక్ష్మీపురం మార్కెట్ లో నిర్వహించిన వేడుకల్లో పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముకలని, వారి కృషి వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్మికులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, వారికి భీమా ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్మికులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి గౌరవించడం మనందరి కర్తవ్యమని కార్మికుల సంక్షేమానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల పై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంఓ సురేఖ, సంబంధిత శాఖల అధికారులు, 27 వ డివిజన్ కార్పొరేటర్ అనిల్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నేత మీసాల ప్రకాష్, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు,స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డేపల్లి బండ్ అభివృద్ధికి రూ.34 కోట్లు

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్, జిల్లా కలెక్టర్



**మహా వరంగల్ బ్యూరో;**హనుమకొండ నగర అభివృద్ధిలో భాగంగా వడ్డేపల్లి ప్రాంతంలో బండ్ సుందరీకరణ అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బల్దియా మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ. 34 కోట్ల వ్యయంతో వడ్డేపల్లి ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే రూ.13 50 కోట్లతో మ్యూజికల్ లైటింగ్ , ఫౌంటెన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయిన అనంతరం వడ్డేపల్లి బండ్ ప్రాంతం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని వారు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వడ్డేపల్లి బండ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గతంలో ఈ ప్రాంత అభివృద్ధికి ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.ఇప్పుడున్న ప్రభుత్వం కేటాయించిన నిధులతో వడ్డేపల్లి బండ్‌ను ప్రత్యేక ఆకర్షణగా మార్చనున్నామని స్పష్టం చేశారు. గతంలో స్మార్ట్ సిటీ నిధులను సమర్థంగా వినియోగించకపోవడం వల్ల కొన్ని ప్రాజెక్టులు నిలిచిపోయాయని ఆయన విమర్శించారు. అయితే గడిచిన రెండేళ్లుగా అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు, సంక్షేమంపై అవగాహన అవసరం

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఉత్తమ సేవలు అందించిన కార్మికులకు అవార్డులు అందజేత



**మహా వరంగల్ బ్యూరో;**కార్మికుల హక్కులు, సంక్షేమం పై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.వరంగల్ జిల్లాలో జిల్లా లేబర్ శాఖ ఆధ్వర్యంలో, డిసిసీ బ్యాంకు మీటింగ్ హాలులో నిర్వహించిన మే డే వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలు, వారి సంక్షేమ పథకాల అమలు పై చర్చలు జరపడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యా రాణి, టిబిసిడిఓ పుష్పలత, ఎంప్లాయిమెంట్ అధికారి సాత్విక, లేబర్ ఆఫీసర్, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు .ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి మేడే సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యంగా మహిళలు, బాలల రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సేవ్ గర్ల్ సేవ్ నేషన్ నినాదాన్ని కూడా ఈ కార్యక్రమంలో ప్రోత్సహించారు.

# పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు సమ్మర్ క్యాంపు కీలకం

- మంత్రి కొండా సురేఖ
- సమ్మర్ క్యాంప్ ను ప్రారంభించిన మంత్రి, జిల్లా కలెక్టర్



**మహా వరంగల్ బ్యూరో;**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వరంగల్ నగరంలోని ఓ సిటీ స్టేడియంలో సమ్మర్ క్యాంప్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ తో కలిసి పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లు పిల్లల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఈ తరహా శిక్షణ శిబిరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జూడో, క్రికెట్, ఫెన్సింగ్, నెట్ బాల్ క్రీడలను మంత్రి ప్రారంభించారు. స్టేట్ లెవల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, ఆర్డీవో వరంగల్ సుమ, జిల్లాస్పోర్ట్స్ అధికారి అనిల్, జిల్లా ఒలంపిక్ సెక్రెటరీ కైలాసం యాదవ్, స్పోర్ట్స్ అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణానికి కార్మికులే మూల స్తంభాలు

- నగర మేయర్ గుండు సుధారాణి
- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా మే డే వేడుకలు
- పాల్గొన్న జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్, ఉప కార్మిక కమిషనర్



**మహా వరంగల్ బ్యూరో ;**దేశ నిర్మాణానికి కార్మికులు మూల స్తంభాలంటూ గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు.ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కార్మిక ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఉప కార్మిక కమిషనర్ వినీత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన కార్మిక శాఖ కార్యకలాపాల బుక్‌లెట్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగామేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం గతంలో జరిగిన పోరాటాలను స్మరించుకునే రోజు మే డే అని తెలిపారు. కార్మికుల కృషి ఫలితంగానే నేడు అనేక కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయని అన్నారు. కార్మికుల హక్కులు, భద్రతను కాపాడటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కార్మిక సంక్షేమం కోసం ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, వివాహ సహాయం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమని, వారి కృషి వల్లే నగరం పరిశుభ్రంగా నిలుస్తోందని చెప్పారు. కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు.

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ**

ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఉద్యమాల ఫలితంగానే సమాన పనికి సమాన వేతనం వంటి హక్కులు సాధ్యమయ్యాయని అన్నారు. ఐటీఐ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని ఆధునిక సాంకేతికతను అలవరుచుకోవాలని సూచించారు. నైపుణ్యాల ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్మికులు లేకపోతే పరిశ్రమలు నిలిచిపోతాయని, వారి పాత్ర అమూల్యమని అన్నారు.

అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, కార్మిక ఉద్యమాల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఐటీఐలలో టాటా గ్రూప్ సహకారంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ఉప కార్మిక కమిషనర్ వినీత మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి కార్మిక శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పలు సంక్షేమ పథకాల ద్వారా వారికి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్మికులకు బీమా చెక్కులు, ఐటీఐ షార్ట్ టర్మ్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను మేయర్, కలెక్టర్, అదనపు కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, బాయిలర్ విభాగ అధికారి నరేష్, సహాయ కార్మిక అధికారులు వినోద్ కుమార్, చాణక్య, రజిత, ఇతర అధికారులు, ఐటీఐ విద్యార్థులు, కార్మికులు పాల్గొన్నారు.



# కార్మికులే సమాజ నిర్మాతలు

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- కార్మికుల హక్కుల రక్షణ కోసం పోరాడుదాం




**మహా వరంగల్ బ్యూరో ;** గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కరీంబాదు లోని ఓల్డ్ ఫర్నిచర్ షాప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్మికుల దినోత్సవ వేడుకలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, కార్మికులే సమాజ నిర్మాతలు అని కార్మికులు తమ హక్కులను పోరాడి సాధించుకున్నారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆ హక్కులు ప్రమాదంలో పడిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు.పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను అమలు చేయకుండా, కేంద్రం తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాల ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన కనీస పని గంటలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రాథమిక సౌకర్యాలు కార్మికులకు అందడం లేదని తెలిపారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఏకమై తమ హక్కుల రక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ ఫర్నిచర్ షాప్ యాజమాన్యాలు, కార్మికులు స్థానికులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

### మాజీ యూత్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, పండ్ల పంపిణీ



**మహా వరంగల్ బ్యూరో;**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంభం శివపటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్ చేసి, స్థానిక ప్రజలకు పండ్లను పంపిణీ చేసి అయూబ్ కు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే, సేవా తత్వంతో ప్రజల మన్ననలు పొందిన నాయకుడు మహమ్మద్ ఆయుబ్ అని సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తీసుకుని నిరంతరం కృషి చేస్తున్న ఆయన సేవలు ఆదర్శప్రాయమని వారు కొనియాడారు.హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొనియాడారు.. అలాగే ఆయన దూరదృష్టి గల నాయకుడని వారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు పార్టీ శక్తిని విస్తరింపజేసి ప్రజల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజలకు న్యాయం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం లో ఆయన నాయకత్వం మరింత మార్గదర్శకంగా నిలవాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, రాష్ట్ర నాయకులు అడుప మహేష్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, కాంగ్రెస్ నాయకులు చిలువేరు శ్రీనివాస్, ఈర్ల రాజేందర్, బొల్లం రవి యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.. కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ మహా;**ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులను ఆదేశించారు.శుక్రవారం ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల, ఎలుకుర్తి గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద నిల్వలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, ఇప్పటివరకు కొనుగోలు చేసిన పరిమాణం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ అధికారులు ముందుగానే కూపన్ విధానం అమలు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరళంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను సజావుగా, వేగవంతంగా నిర్వహించాలన్నారు. గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు తక్షణమే తరలించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి మౌలిక సౌకర్యాలు సమృద్ధిగా ఉండాలని, ఎలుకుర్తిలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను అభినందించారు. రైతుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, వారికి చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులను సంప్రదించాలని రైతులకు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి జిల్లాలో ఇప్పటివరకు 3.61 కోట్ల రూపాయల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. రైతులకు చెల్లింపులు వేగవంతంగా జరుగుతున్నాయని, గన్నీ సంచుల కొరత లేదా ధాన్యం తరలింపులో ఎటువంటి సమస్యలు లేవని వివరించారు.

**ఉపాధి హామీ పనుల పరిశీలన**

మండలంలోని సాయిపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించారు. కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వేసవికాలం దృష్ట్యా ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య పనులు నిర్వహించాలని సూచించారు. వడదెబ్బ నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు తెలిపారు. పనులకు సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**కార్మికులకు ఘన సన్మానం**

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులతో కలిసి ఘనంగా సన్మానించారు. కూలీలకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీను, సిసిఓ సంజీవ రెడ్డి, డిసిఎస్ ఓ వాజిద్ అలీ, డిఎం సివిల్ సప్లైస్ మహేందర్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఏడీఏ ఆదిరెడ్డి, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

08

శనివారం, హైదరాబాద్ | 02-05-2026 జిల్లా వార్తలు DISTRICT NEWS WWW.MAHAADAILY.COM

## ప్రపంచ కార్మికులారా ఏకంకండి

- సమ సమాజ నిర్మాణమే కార్మిక వర్గం లక్ష్యం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**రాజేంద్రనగర్, మహా ;** అంతర్జాతీయ కార్మిక దినం మేడే ఉత్సవాలు శుక్రవారం శంషాబాద్ లో ఘనంగా నిర్వహించారు. సిపిఐ ఏఐటియుసి ఆధ్వర్యంలో శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి ఆధ్వర్యంలో మేడే కార్యక్రమంలో ముఖ్యాతిథిగా పానుగంటి పర్వతాలు పాల్గొని జెండాను ఆవిష్కరించారు.ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని నినదిస్తూ సాగిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. సమ సమాజ నిర్మాణం కోసం కార్మిక వర్గం పోరాడాలఅని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ నాడు అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికులు చిందించిన రక్తంతో ఎరిపెక్కిన ఎర్రజెండాలు చేత పట్టుకొని ప్రపంచవ్యాపితంగా కార్మికులు ఏకమై పోరాడి పని గంటల చట్టాలను కనీస వేతనాలను ఇతర మౌలిక చట్టాలను సాధించారని ఆయన గుర్తు చేశారు . ఆనాటి పోరాడి సాధించుకున్న చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు కోడ్ లను తెచ్చి వాటిని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మిక చట్టాలను సాధించుకోవడానికి నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసేవరకు ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ యాదగిరి, కార్యదర్శి జిలకర రాజు, నరేష్ నాయక్, శీను, రాజేందర్ గౌడ్, రైతు సంఘం నాయకులు బద్దం శివారెడ్డి, చారి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో మే డే వేడుకలు

**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లాలో వివిధ పార్టీలు ,కార్మిక సంఘాలలు మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారుఇందులో భాగంగా ఆలేరులో సిపిఐ దాని అనుబంధ సంఘాలు ఎఐటియుసి ఆధ్వర్యంలో నేడు 141 వ మే డే వేడుకలు ఘనంగా జరిపారు. పట్టణంలో సిపిఐ, అనుబంధ సంఘాలు ఎఐటియుసి నాయకులు ర్యాలీ నిర్వహించి బస్ స్టాండ్ సమీపంలో జెండా ఎగురవేసి 8 గంటల పని విధానం కావాలి పోరాడిన అమరకార్మికులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో



సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు చెక్క వెంకటేష్,మండల కార్యదర్శి కనకయ్య,శ్రీనివాస్, జానమ్మ,శ్రీనివాస్ రాజు,పర్శరాములు,మధు తదితరులతో పాల్గొన్నారు.

## గిరిప్రదక్షిణ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా:** తెలంగాణ ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన యాదగిరిగుట్ట పంచనారసింహుని ఆలయ కొండ చుట్టూ శుక్రవారం సామూహిక గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద నూతనంగా ప్రతిష్ఠింపజేసిన స్వామివారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం



పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు.ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం అందజేశారు.

## ఆర్టీసీ డిపోలో మే డే వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన మే డే వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు బీర్ల అయిలయ్యకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆర్టీసీ కార్మికులను సన్మానించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, కార్మికులే సమాజ నిర్మాణానికి పునాది అనిఅన్నారు. వారి కష్టపడే తత్వం వల్లనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మొన్నటి ఆర్టీసీ కార్మికుల సమ్మెలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కు ఎమ్మెల్యే ఘనంగా నివాళులు అర్పించారు.ఆర్టీసీ కార్మికులు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడుతూ, వారి సేవలు ఎప్పటికీ గుర్తుండేలా ఉంటాయని అన్నారు.దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని వ్యవసాయం పరిశ్రమలు నిర్మాణ రంగంలో వారి సేవలు గొప్పవారు కార్మికుడి దేశానికి వెన్నుముక అనే భావనతో ఈరోజు కార్మికుల దినోత్సవం జరుపుకోవడం సంతోషం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సంగెంలో ఐకెపి సెంటర్ ప్రారంభం

**వలిగొండ, మహా:** వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో శుక్రవారం ఐకెపి సెంటర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను మార్కెట్ చైర్మన్ భీమా నాయక్ తహసిల్దార్ దశరథ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాదూరు లలిత లింగస్వామి సంఘ బంధం అధ్యక్షురాలు భార్గవి రేణుక రైతులు మార్కెట్ కమిటీ సభ్యులు నాయకులు వరికుప్పల మల్లేశం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో మేడే ఉత్సవాలు

**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో సిపిఎం,సిఐటియుల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సిపిఎం నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్ స్టాండ్ సమీపంలో cpm కార్యాలయం పై అలాగే citu జెండాను ,హమాలి సంఘం వద్ద మేడే జెండాల ఆవిష్కరించారు. 8 గంటల పని విధానం కావాలి పోరాడిన చికాగో అమరవీరులకు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు



వెంకటేష్, ఏక్బాల్,రమేష్, చంద్ర శేఖర్,పౌలు తదితరులతో పాల్గొన్నారు.

## వలిగొండలో మే డే వేడుకలు

### మేడే స్ఫూర్తితో బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం మేడే వేడుకలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మార్తూరు బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు మద్యల రాజయ్య సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం అని కార్మికుల హక్కులను కాలరాస్తున్న బిజెపి విధానాలను ఎండగడదామని నాటి అమరుల స్ఫూర్తితో మేడే సందర్భంగా ఈ కార్యక్రమంలో ఈర్లపల్లి ముత్యాలు తుర్కపల్లి సురేందర్ కూర శ్రీనివాస్ మెరుగు వెంకటేశం గర్దాస్ నరసింహ మొగిలిపాక గోపాలు కల్కూరి రామచందర్ చీర్క శ్రీశైలం రెడ్డి కల్కూరి ముత్యాలు దుబ్బాలింగం కవిడే సురేష్ భీమనబోయిన జంగయ్య బూడిద మన్నెమ్మ దొడ్డి బిక్షపతి స్నానం చర్ల రమేష్ శీలం ఇందిరా కర్నాటి మచ్చ రాణి కొండూరు సత్తయ్య బొద్దుపల్లి బిక్షపతి పల్సర్ స్వామి గుండెపురి నరసింహ చేగోరి నగేష్ కొమ్ము స్వామి గంగాపురం కృష్ణయ్య సల్ల ఐలయ్య ఏనుగు సాయి రెడ్డి రాధారపు మల్లేశం తుమ్మల నర్సిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బందారపు ధనంజయ జక్కా రాఘవరెడ్డి గంగాపురం వెంకటేశం మైసొల్ల నరేందర్ దువ్వ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు, విలేకరులకు టోపీలు పంపిణీ

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా:** ఎండ తీవ్రంత నుండి కొంత వరకు రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో పలువురు జర్నలిస్టులకు శుక్రవారం తెల్ల టోపిలను పంపిణీ చేశారు..ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులకు,విలేకరులకు ఈ టోపిలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తాజా గా తుర్కపల్లి మండలంలో పర్యటించిన సందర్భంలో పోలీసులకు, విలేకరులకు తెల్ల టోపిలు అందజేశారు.. మిగతా మండలల్లో కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు..



## మున్సిపల్ కార్మికులకు సన్మానం చేసిన 28 వార్డు కౌన్సిలర్

### సూదగాని సరిత రాజు గౌడ్

**యాదాద్రి భువనగిరి, మహా:** అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా భువనగిరి మున్సిపాలిటీ 28 వ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి ఆ వార్డు కౌన్సిలర్ సూదగాని సరిత రాజు గౌడ్ సన్మానం చేసారు. నిత్యం వార్డును పరిశుభ్రంగా ఉంచడానికి ఎంతో శ్రమిస్తున్న మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని సన్మానించుకోవడం మన బాధ్యత అని కౌన్సిలర్ అన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ఎండలను తట్టుకొని పనిచేయడానికి వీలుగా టోపీ మరియు వాటర్ బాటిల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ



నాయకులు పోత్నక్ సన్నీ, వార్డు సభ్యులు నానంచర్ల శివ, మాటూరి సుశాంత్, దాస మణికంత, మాటూరి సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి మాధవ రెడ్డి జయంతి

**యాదాద్రి భువనగిరి, యాదాద్రి :** భువనగిరి కీర్తిశేషులు మాజీ మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి జయంతి కార్యక్రమం భువనగిరి జిల్లా కేంద్రం లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న మాధవ రెడ్డి విగ్రహానికి సతీమణి మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవ రెడ్డి,కుమారుడు మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి మరియు మునిసిపల్ చైర్మన్ తంగడపల్లి శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోత్తంశెట్టి మంజుల వెంకటేష్ లు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి



,పి విరేశం ,డొప్ప వెంకటేష్ ముదిరాజ్, ఎవి కిరణ్ కుమార్, జనగాం పాండు, బచ్చుశ్రీనివాస్, శేఖర్ ,రచ్చ శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు

## కలెక్టరేట్ లో ఘనంగా మే డే వేడుకలు

**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మే డే వేడుకలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, భద్రత మరియు సంక్షేమాన్ని నిర్ధారించడానికి కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం యొక్క ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. ఐటీఐ మరియు ఏటీసీ శిక్షణా కార్యక్రమాల కింద, యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహిస్తూ, శిక్షణార్థులకు యూనిఫాం మద్దతుతో పాటు నెలకు ₹2000 స్టైఫండ్ అందిస్తున్నారన్నారు.జిల్లా ఉపాధి కార్యాలయం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మరియు వృత్తి మార్గదర్శకత్వం కల్పించడంలో చురుకుగా పనిచేస్తోందన్నారు.నైపుణ్యం గల కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) పై అవగాహన కల్పించారు. అధికారులు కార్మిక శాఖ యొక్క వివిధ సంక్షేమ పథకాలను, ముఖ్యంగా భవన



మరియు ఇతర నిర్మాణ కార్మికుల (BOCW) కోసం ఉద్దేశించిన వాటిని వివరించారు. అలాగే, సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందడానికి లేబర్ కార్డ్ నమోదు చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖులు కార్మికులను ప్రోత్సహించారు మరియు వారి సంక్షేమం, అభివృద్ధికి నిరంతర మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ , ఆర్డీవో కృష్ణారెడ్డి , క్రీడా మరియు యువజన శాఖ అధికారి ధనంజనేయులు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి,ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, ఈఎస్ఐ డాక్టర్, సహాయ కార్మిక అధికారి, హరికృష్ణ,ఐటిఐ ప్రిన్సిపాల్, ఐఎన్‌టీయూసీ మరియు ఎలక్ట్రీషియన్ యూనియన్ భువనగిరి, ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పథకాల పై ప్రజలు అవగాహన కల్పించుకోవాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మహా:**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 2న ఉదయం :9.30 గంటలకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా ప్రభుత్వ ప్రథకాల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెండు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అందులో భాగంగా భువనగిరి నియోజకవర్గంకు సంబంధించి రాయగిరిలోని సోమరాధ ఫంక్షన్ హాల్ నందు సమావేశం ఏర్పాటు చేయనైనది.ఆలేరు నియోజకవర్గం కు సంబంధించి అల్లేరులోని ఇమ్మడి నర్సింహా రెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేయనైనదని తెలిపారు. ఇట్టి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశంలో ప్రభుత్వ ప్రధాన పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపు, ప్రజల భాగస్వామ్యంతో స్థానిక అభివృద్ధి అవసరాల గుర్తింపు, ప్రస్తుత పథకాలు, రాబోయే పథకాల , తదితర సంక్షేమ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

## కార్మికులకు కనీస వేతనం ముప్పై వేలుగా నిర్ణయించండి

### తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ బాబు

**కుషాయిగూడ, మహా :** కార్మికులందరికీ కనీస వేతనం రూ. 30 వేలుగా ప్రభుత్వం నిర్ణయించాలని, వారికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు సక్రమంగా అమలు చేయాలని తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ అండ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివ బాబు డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా జవహర్ నగర్ బాలాజీ నగర్ లో ఐఎఫ్ టీయూ ఆధ్వర్యంలో తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ అండ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి శివబాబు ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ బాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు కట్టు బానిసత్వంలోకి నెట్టి వేయబడ్డారన్నారు. ఇకనైనా కార్మికులకు కనీస వేతనం రూ. 30 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ,



పీఎఫ్ సౌకర్యాలు సక్రమంగా అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా కార్మికులను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మున్సిపల్ కార్మిక నాయకులు పవన్, ప్రేమ్ కుమార్, రామచందర్, ఉపేందర్, ప్రకాష్, వెంకటమ్మ ,లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి కమిషనరేట్‌కు

## మహిళ నేతృత్వం

### మొదటి మహిళా కమిషనర్‌గా సుమతి చరిత్ర

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనరేట్‌కు ఉన్న శాంతియుత ప్రతిష్ఠను కొనసాగిస్తూ మరింత మెరుగుపరుస్తానన్నారు. తొలి మహిళా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని, ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. టెక్నాలజీ ఆధారిత నాణ్యమైన పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ సమస్యను ప్రధానంగా గుర్తించామని, దాని నియంత్రణకు కఠిన చర్యలు చేపడతామని వెల్లడించారు.

## జై శ్రీ రామ్ నినాదాలతో దద్దరిల్లిన కుషాయిగూడ

- 54 అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం
- సీతారామస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహణ

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ బస్టాండ్ సమీపం శుక్రవారం భక్తి పారవశ్యంతో మార్మోగింది. 54 అడుగుల ఎత్తైన భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చి "జై శ్రీ రామ్", "జై బజరంగబలి" నినాదాలతో ప్రాంతాన్ని దద్దరిల్లించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందు వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. భారీ విగ్రహం దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఈ సందర్భం



గా నిర్వహించిన సీతారామస్వామి కళ్యాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన కళ్యాణ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది. భక్తులు తలపాగా, పూలమాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి, యోగానంద సరస్వతీ స్వామి, త్రిదండి చిన జీయర్ స్వామి విచ్చేసి ఆశీర్వచనాలు అందించారు. వారు ధర్మ పరిరక్షణలో భక్తుల పాత్ర ఎంతో ముఖ్యమని, ఇలాంటి మహోత్సవాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అలాగే చిట్టిపెద్ది రామశర్మ, బ్రహ్మశ్రీ ఆర్. శివ కార్తీక్ శాస్త్రి తదితరులు కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది భక్తులతో పాటు స్థానికంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కుషాయిగూడ పరిసర ప్రాంతాలు మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించగా, భక్తి నినాదాలతో రోజు పొడవునా ఆ ప్రాంతం మార్మోగింది. భారీ పోలీస్ బందోబస్తు మధ్య కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.

## కాప్రాలో ఘనంగా మే డే ఉత్సవాలు

### భారీ ర్యాలీ.. కార్మిక హక్కుల పరిరక్షణకు నినాదాలు

**కుషాయిగూడ, మహా :** మే డే దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా ప్రాంతంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమ హాజరయ్యారు. ఏఎస్ రావు నగర్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్ నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు మేడే అమరవీరుల ఫోటో ప్రభలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేడే జెండా ఆవిష్కరించి కార్మిక హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకుంటామని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం ముందు, తర్వాత అనేక బలిదానాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రస్తుతం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జై చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏ. అశోక్, నాయకులు పి. సత్యం, కోమటి రవి, జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు బి.వి. సత్యనారాయణ, నాయకులు కొండల్ రెడ్డి, దుర్గయ్య, దేవి రెడ్డి, కార్తీక్, అవినాష్ పాల్గొన్నారు. అలాగే వివిధ యూనియన్ల ప్రతినిధులు ఎపిరాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. మణికంత, గండూరి ఫుడ్స్ ప్రధాన కార్యదర్శి టి. రవీందర్ రెడ్డి, ఎస్పీఎం ప్రధాన కార్యదర్శి టి. నరసింహ, థైసన్ కృప్ ప్రధాన కార్యదర్శి కే. బాలరాజు, శివప్ర, ఆశీస్ క్రేన్ ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్, ఐక్యూబ్ ప్రధాన కార్యదర్శి కే. సంతోష్, 3డి ఫోమ్ కట్ ప్రధాన కార్యదర్శి బి. ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.




## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాడుదాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్

**కుషాయిగూడ, మహా :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక లోకం ఐక్యంగా పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.ఎస్.బోస్,పిలుపునిచ్చారు. శుక్రవారం మేడే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జవహర్ నగర్ లోని పలు ప్రాంతాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఆవిష్కరణలు, బహిరంగ సభలు ఘనంగా నిర్వహించారు. అనంతరం డెంటల్ కాలేజీ ముందున్న గిరిప్రసాద్ నగర్‌లో జరిగిన బహిరంగ సభలో వీఎస్ బోస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన ప్రాణత్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న హక్కులని గుర్తుచేశారు.1216 గంటల పని గంటలకు వ్యతిరేకంగా జరిగిన హే మార్కెట్ ఘటన ప్రపంచ కార్మిక ఉద్యమానికి మలుపు తిప్పిందని, అప్పటి నుండి మే 1ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. నేడు కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు మరియు నిరుద్యోగ యువత తమ హక్కుల రక్షణ కోసం మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.




**బిజెఆర్ నగర్‌లో నూతన ఆటో స్టాండ్ ప్రారంభం**

మేడే సందర్భంగా బిజెఆర్ నగర్‌లో నూతన ఆటో స్టాండ్‌ను బోస్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ ప్రారంభించి, జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆటో యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గౌరవ అధ్యక్షులు ఇల్లందుల ప్రభాకర్, అధ్యక్షులు గొల్లూరి ఎల్లయ్య, ఉపాధ్యక్షులు వి. రామాచారి, ప్రధాన కార్యదర్శులు కె. బాబు, ఏ. శ్రీనుకార్యదర్శి డి. యాదయ్య, కోశాధికారి టేకుల ప్రశాంత్,ఎన్నుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com